

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా





సంపుటి - 06 | సంచిక 253 | ఎడిటర్ : బరిగెల శివ | శనివారం 09, ఆగస్టు 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్

# దేవాదాయ శాఖలో దేశముదుర్లు









డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

ప్రపంచవ్యాప్తంగా భారతదేశంలో హిందూ సంప్రదాయాలకు పెట్టింది పేరుగా నిలుస్తున్నాయని డాక్టర్ బరిగెల శివ తన భావనను వ్యక్తపరిచారు. భారతదేశ వ్యాప్తంగా తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో హిందూ సంప్రదాయాలను కట్టుదిట్టంగా పాటించే భక్తులు కోట్లల్లో కలరన్నారు. తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన అతిపెద్ద దేవాలయం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి టెంపుల్ యాదగిరిగుట్ట ప్రాంతంగా పిలువబడేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అతి సుందరమైన ఆలయంగా పేరుగాంచుతున్న చిలుకూరు బాలాజీ దేవాలయం హైదరాబాద్ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తూప్రపంచ దేశాలను

- మిగతా 2లో..

భక్తుల విశ్వాసంతో వ్యాపారం చేస్తున్నారు

మంత్రి కొండా సురేఖ గౌరవానికి మచ్చ తెస్తున్నారు

పైస సంపాదననే లక్ష్యంగా పెట్టుకుంటున్నారు

తాగుడుకు బానిసలై జల్సాలకు ఎగబడుతున్నారు

ఉద్యోగ ధర్మానికి తూట్లు పొడుస్తున్నారు

దేవాలయాల నిర్మాణాలకు కోట్ల రూపాయల నిధులను మంజూరు చేస్తున్న ప్రభుత్వం

ఈవోల ఆస్తులపై పక్కా విచారణకు జరపాల్సిందే

అక్రమంగా ఉద్యోగంలో చేరిన వాళ్ళ సంఖ్య లెక్క తేల్చాలి

హిందూ సంప్రదాయాలను హింసల వైపు మళ్ళిస్తున్నది ఎవరు

ఆలయ రాబడి నిధులను ఖాజేస్తున్నది ఎవరు?

తాగుబోతు ఆలయ అధికారులకు ఉద్యోగ నియమాల వెసులుబాటు ఉందా

గుంపులు గుంపులుగా సెలవులు పెట్టి తాగుడుకు మరిగి వ్యక్తిగతం అంటున్నారు : డాక్టర్ బరిగెల శివ


## వరసు సెలవులతో గ్రామాలకు జనాలు

ఆర్టీసీ బస్టాండ్లలో పడిగాపులు

**హైదరాబాద్,ఆగస్ట్8(జై భీమ్ న్యూస్ ):**

ఈ నెల 9వ తేదీ శనివారం రాఖీ పండుగ నేపథ్యంలో అక్కాచెల్లెళు తమ సోదరుల వద్దకు వెళ్లేందుకు పయనమయ్యారు. దీంతో ఆడ బిడ్డలందరూ ఆయా బస్టాండ్లకు చేరుకుంటున్నారు. కానీ సరిపడా బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరంలోని ఎంజీబీఎస్ బస్టాండ్‌లో జిల్లాలకు వెళ్లే బస్సుల కోసం ప్రయాణికులు గంటల తరబడి వేచి చూస్తున్నారు. కానీ బస్సులు సమయానికి రాకపోవడంతో ఆర్టీసీ అధికారులపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం చేస్తున్నారు. పండుగల వేళ ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటు- చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.శ్రావణ శుక్రవారం, రేపు రాఖీ పండుగ, ఆదివారం కావడంతో విద్యార్థులు, ఉద్యో గులు కూడా తమ సొంతూర్లకు వెళ్లేందుకు బస్టాండ్లకు చేరుకోవడంతో ప్రయాణికులతో బస్టాండ్ ప్రాంగణాలు కిటకిటలాడుతున్నాయి. బస్సులు తగినన్ని లేకపోవడంతో ప్రయాణికులందరూ ఆర్టీసీ అధికారులను ఆరా తీసారు.





## భారీవర్షాలతో నగరంలో ఇక్కట్లు

అప్రమత్తంగా ఉండాలి సిఎం ఆదేశం

పొంగిప్రవహిస్తున్న మూసీ నది

ఈదులవాగులో కొట్టుకు పోతున్న కారును కాపాడిన స్థానికులు 3

## బిజెపికి తొత్తుగా ఎన్నికల సంఘం

ఓట్ల దొంగతనానికి ఇసి సహకారం

తన ఆరోపణలపై ఇసి ఎందుకు మౌనం

వెంటనే ప్రజలకు నిజాలు వెల్లడించాలి

బెంగళూరు సమావేశంలో రాహుల్ తీవ్ర విమర్శలు

2



## కెటిఆర్‌కు రాఖీ కట్టిన లగచర్ల గిరిజన మహిళలు

**హైదరాబాద్,ఆగస్ట్8(జై భీమ్ న్యూస్ ):**



భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కొడంగల్ నుంచి వచ్చిన గిరిజన సోదరీమణులు రాఖీ కట్టి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. ప్రభుత్వం తమ జీవితాలను, జీవనాధారమైన వ్యవసాయ భూములను లాక్కున్నప్పుడు, తమకు ఒక అన్నలా అండగా నిలిచిన కేటీఆర్‌కు రాఖీ కట్టామని వారు తెలిపారు. కొడం గల్ మండలం లగచర్ల గ్రామం రోటిబండ తండాకు చెందిన జ్యోతి, మరికొంతమంది మహిళలు కేటీఆర్ నివాసానికి వెళ్లి రాఖీ కట్టారు. లగచర్ల భూ పోరాటం సమయంలో నిండు గర్భిణిగా ఉన్న జ్యోతిపై రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, పోలీసులు దౌర్జన్యం చేశారని, ఆమె భర్తను జైలుకు పంపిన, సమయంలో కేటీ-ఆర్ ఢిల్లీ వెళ్లి పలు కమిషన్లకు ఫిర్యాదులు చేసి, జ్యోతితో పాటు- లగచర్ల గిరిజనులకు, పేద రైతన్నలకు జరుగుతున్న అన్యాయాన్ని ఢిల్లీ వేదికగా ఎండగట్టారు. దీని ఫలితంగా, ప్రభుత్వం భూసేకరణను వెనక్కి తీసుకుందని వారు తెలిపారు. కేసుల కారణంగా జైలుపాలైన లగచర్ల సోదర సోదరీమణులందరికీ కేటీఆర్ అన్నగా అండగా నిలబడి, న్యాయ సహాయం అందించారని, అందరినీ జైలు నుంచి విడిపించారని వారు తెలియజేశారు.


జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# దేవాదాయ 'శాఖలో దేశముదుర్లు

మొదటి పేజీ తరువాయి

ఆకర్షిస్తుందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచిన దేవాలయాలలో శ్రీ లక్ష్మీనరసింహ దేవాలయం,రామప్ప దేవాలయం,వేయిస్తంభాల గుడి, చిల్కూరు బాలాజీ దేవాలయము,భద్రకాళి దేవాలయం,శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం, లాంటివి పురాతన కాలం మొదలుకొని చరిత్రలో నిలిచిపోయేవిగా ఉంటున్నాయన్నారు.ఆంధ్రప్రదేశ్లో ప్రప్రథమంగా ప్రసిద్ధిగాంచిన దేవాలయాలలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం తిరుపతిలో ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు.ఈ దేవాలయాన్ని దర్శించుటకు మిలియన్ సంఖ్యలలో యాత్రికులు బారులు తీరుతుండడం దైవ భక్తికి నిదర్శనం అన్నారు.ఆంధ్రప్రదేశ్లో ప్రముఖమైన దేవాలయాలలో శ్రీశైలం మల్లికార్జున దేవాలయం కనకదుర్గ దేవాలయం సింహాచలం దేవాలయం,అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం లేపాక్షి వీరభద్ర దేవాలయం శ్రీకాళహస్తి దేవాలయం అమరలింగేశ్వర దేవాలయం,లాంటివి ప్రసిద్ధిగాంచినవిగా పురాతన కాలం మొదలుకొని కొనసాగించబడుతున్నాయన్నారు. అతి పురాతన కాలంమొదలుకొని హిందూ సాంప్రదాయాలు భక్తి విశ్వాసంతో కొనసాగించబడుతుండగా నేటి దేవాలయాలలో రాజకీయ జోక్యం ఊహించని స్థాయిలో పెరిగిపోయిందన్నారు.బక్తుల విశ్వాసాలను ఆసరా చేసుకుని ఆలయపు అధికారులు అర్చకులు ధన సంపాదనకు మరుగుతున్నారన్నారు.సునాయాసంగా కోట్లల్లో ఆస్తులు సంపాదిస్తూ ఆదాయానికి మించిన ఆస్తి దారులుగా చలామణి అవుతున్నారన్నారు.అనేక సంవత్సరాలుగా ఒకే దేవాలయంలో ఒకే స్థానంలో పనిచేస్తున్న ఉద్యోగులు అధికారులు ఆయా ప్రాంతాలలో అన్ని పార్టీల స్థానిక నేతలతో సంబంధాలు పెంపొందించుకొని గుట్టు చప్పుడు కాకుండా గంపల కోద్ది ఆస్తులు సంపాదించుకొని గుమ్మిలు నింపుకుంటున్నారన్నారు. అక్రమంగా ఆస్తులు సంపాదిస్తున్న అధికారుల పట్ల ప్రశ్నిస్తున్న యువతను, జర్నలిస్టులను అణిచివేసే కుట్రలు పన్నుతూ రహస్యంగా కేసులపాలు చేస్తూ చిత్రవధకు గురి చేస్తుండగా నేరుగా రాజకీయ అండను ప్రదర్శిస్తూ తిరుగులేని అదికారులుగా చిలామణి సాగిస్తున్నారన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మరమ్మత్తులు చేయబడుతున్న ప్రతిష్టాత్మకమైన ఆలయాలకు లెక్కకు మించిన ధన నిధులను మంజూరు చేస్తూ ఉంటుండగా నిర్మాణాల పనుల్లో రీ డిజైన్ నిర్మాణాలలో ఎక్కడలేని ఆర్థిక లావాదేవీల తర్జుమాలు జరుగుతున్నాయని భక్తులు విస్తుపోతున్నారన్నారు.రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రధాన దేవాలయాలలో దేవాదాయ శాఖకు సంబంధించిన భూములను ప్రైవేటుపరంగా అమ్మకాలకు పెడుతూ వ్యాపారాలు చేస్తున్న అర్చకులు ఆలయ ఈవోలు సిబ్బందులు లేకపోలేదన్నారు. ఏకంగా ఆలయ భూములనే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే స్థాయికి ఆలయ అధికారులు వ్యవస్థను దిగజారుస్తున్నారంటే నేటి దేవాలయాల భక్తి ఎటువైపు దారితీస్తుందో ఇరు రాష్ట్రాల ప్రజలు గమనించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఒకవైపు ప్రభుత్వాలు హిందూ ధర్మాన్ని హిందూ సంస్కృతిని హిందూ సంస్కారాన్ని హిందూ నిజాయితీని హిందూ విశ్వాసాలను బలపరుస్తూ కాపాడుతూ బలోపేతం చేస్తుంటే వాటన్నిటికీ భిన్నంగా అధికారులు మాత్రం లోలోపల అంచనాలకు మించిన ఆస్తులను సంపాదిస్తూ భక్తులకు ఆలయ దర్శనాలకు సౌకర్యాలు కల్పిస్తున్నామంటూ ప్రత్యేక రాయితీలను కల్పిస్తూ ఆధారాలు లేని రికార్డులు లేని సొమ్మును కోకోల్లం సంపాదిస్తున్నారన్నారు.నిజాయితీగా చెప్పాలంటే హిందూ ధర్మం కోసం విశ్వాసాన్ని బలపరుచుకోవడానికి కోట్లకు మించి దానం చేయగల భక్తులు కోకోల్లంకలరన్నారు.తెలంగాణ విషయానికి వస్తే మంత్రి కొండా సురేఖ దేవాదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టాక సంవత్సరాల తరబడి మూలుగుతున్న దేవాలయ అధికారుల పదోన్నతులను ఇప్పించారన్నారు.ఆలయ ఉద్యోగులకు రావలసిన జీతభత్యాలను పెంపొందించారన్నారు.ప్రభుత్వమే దేవాలయాలకు సంబంధించిన మరమ్మత్తులను,అభివృద్ధి పనులను స్వయంగా చేపట్టే ఆస్కారాన్ని కల్పిస్తున్నారన్నారు.ఏ మాటకు ఆ మాట చెప్పుకోవాలి గాని గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్రంలోని హిందూ దేవాలయాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు.నాటి పాలకుల శ్రమ దేవాలయాల అభివృద్ధిపై కట్టుదిట్టంగా ఉంటే నేటి పాలకుల శ్రమ అదే తరహాలో కొనసాగుతున్నప్పటికిని ఆలయాల అర్చకులు ఈవోలు, ఉద్యోగులు మాత్రం భక్తి మార్గాన్ని బుక్తి మార్గంగా మార్చుకుంటూ పలువిదాల వ్యాపారాలకు పాల్పడుతున్నారన్నారు.రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనరేట్ కార్యాలయంలో అక్రమమైన ఉద్యోగులకు అక్రమమైన ఈవోలకు అతి భయంకరమైన పైరవీల సహకారం లభిస్తుందన్నారు.సంవత్సరాల తరబడి ఇన్చార్జిలుగా కొనసాగుతున్న ఈవోలు రాజకీయ పలుకుబడితో స్థానిక ఎమ్మెల్యేల ప్రోత్సాహంతో అదే స్థానంలో రెగ్యులర్ ఆర్డర్లను పొందుకోవడం కోసం చేతులు మారుస్తూ స్థానాలను కాపాడుకునే ప్రయత్నం తీవ్రంగా కొనసాగిస్తున్నారన్నారు. భక్తిశ్రద్ధలకన్నా పరువు ప్రతిష్టల కన్నా పోస్టింగులు కాపాడుకోవడానికి తీవ్రమైన ప్రాధాన్యతనిస్తూ దేవదాయ శాఖను తప్పుదారి పట్టిస్తున్నారన్నారు.అక్రమంగా ఆస్తులు సంపాదించిన జూనియర్ అసిస్టెంట్ సీనియర్ అసిస్టెంట్ పై ఈవోలు లాంటి అధికారులపై ఆదాయానికి మించిన ఆస్తుల విచారణలు కొనసాగించక తప్పదన్నారు.ఆలయ రాబడి నిధులను కాజేస్తున్న అధికారులను ఊరికే వదలొద్దన్నారు.పండుగ వేళల్లో జాతరలకు కోట్లకు కోట్ల నిధులు కేటాయిస్తున్న ప్రభుత్వాలు వాటి లెక్కల ఆధారాలను సేకరించడంలో ఏమాత్రం శ్రద్ధ చూపించలేకపోతున్నారన్నారు.దేవాదాయ శాఖ భూములను యదేచ్ఛగా అమ్ముకుంటున్న అర్చకులు ఈవోలపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.దేవాదాయ శాఖ కమిషనరేట్ కార్యాలయంలో పైరవికారులదే అవా కొనసాగుతున్నప్పటికిని భక్తుల విశ్వాసాల కన్నా అక్రమ అధికారులైన ఈవోలకు సక్రమమైన ఆర్డర్స్ మంజూరు చేయడం కోసం లక్షల్లో చేతులు మారుతున్నాయని భక్తులు తీవ్రంగా మండిపడుతున్నారన్నారు.భక్తుల నమ్మకాలను అధికారులు ఆస్తుల సంపాదన కోసం వాడుకుంటున్నారన్నారు.ప్రతి ఆలయంలో ఆడిట్ లెక్కలు అస్తవ్యస్తంగా ఉంటున్నప్పటికిని సంవత్సరాల వారిగా ఆదాయపురాబడి,ఖర్చు లెక్కలు మిగులుబాటు అప్పులు అన్ని దేవాలయాల వెబ్సైట్లో మొదలుకొని నోటీస్ బోర్డ్ లలో పొందుపరిచి భక్తుల విశ్వాసాన్ని భక్తుల నమ్మకాన్ని భక్తులు చెల్లిస్తున్న దానం రూపంలో నిధులకు నిజాయితీని కనపరచాలన్నారు.తప్పుడు దృవపత్రాలతో కాలం చెల్లిని విద్య ధ్రువ పత్రాలతో 1990 మొదలుకొని నేటి వరకు ఉద్యోగంలో చేరిన అధికారుల జాబితా వెలిక్కితీసి చదువులు పూర్తవకుండా ఉద్యోగంలోనికి చేరిన ఉద్యోగులను కఠినంగా శిక్షించి ఉద్యోగంలో కెల్లి తొలగించాలన్నారు.అదే క్రమంలో నిజాయితీ కలిగిన దేవాదాయ శాఖలో పనిచేస్తూ ప్రభుత్వాన్ని దేవాదాయ శాఖ ఉన్నత అధికారులను మోసం చేస్తూ ఉద్యోగంలోనికి చేరిన విధానం పట్ల చదువులకు చెందిన దృ వపత్రాలను పరిశీలిస్తూ తప్పుడు సమాచారంతో ఉద్యోగంలో చేరిన వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైళ్లకు పంపాలన్నారు.ఆలయాల నిర్మాణాలలో టెండర్ల నిజాయితీ తప్పుదారి పడుతుందని భక్తులు విశ్వాసులు తీవ్రంగా మండిపడుతున్నారన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఆలయంలోని ఈవోల ఆస్తులపై అర్చకుల ఆస్తులపై విచారణ జరిపించాలన్నారు.ఆలయ దోపిడిని అరికట్టకపోతే భక్తుల విశ్వాసం సన్నగిల్లబడే ఆస్కారం ఉందన్నారు.ఆలయాల్లో జరుగుతున్న నిధుల నిలువు దోపిడీకి ఐకమత్యంగా సహకారం లభిస్తుందని ప్రతి ఆలయ సిబ్బంది గర్వంతో కూడిన అహంకారాన్ని ప్రదర్శిస్తూ కొన్ని ప్రాంతాలలో పచ్చి తాగుబోతులుగా మారి వాళ్ల మనోభావాలు దెబ్బతింటున్నాయంటూ సామాన్యులపై కేసులు పెట్టించి చిత్రవధకు గురి చేస్తున్నారన్నారు. ఏ శాఖకు చెందిన ఉద్యోగి ఐనా ఉద్యోగం చేస్తున్న స్థానంలో మాత్రమే కాకుండా ఎక్కడి ప్రాంతంలో సంచరించిన ఉద్యోగ ధర్మానికి విరుద్ధమైన పనులను ఉద్యోగ ధర్మానికి అపకీర్తిని తెచ్చిపెట్టే పనులను ఉద్యోగ ధర్మానికి అన్యాయమైన పనులను ఉద్యోగ ధర్మానికి వ్యతిరేకంగా తాగుబోతు పనులను చేసినట్లయితే అలాంటి వాళ్ళను గుర్తించి తక్షణమే ఉద్యోగంలోకి కెళ్లి తొలగించాలన్నారు.కొన్ని ఆలయాలలో సెలవులు పెట్టుకుని తాగుడుకు మరుగుతున్న సంఘటనలు వెలుగులోనికి వస్తున్న సందర్భాల్లో నాయకులకు పైసా ఆశలు చూపుతూ పోలీస్ స్టేషన్లో కేసులు పెట్టిస్తూ తాగుబోతులైన అధికారుల వ్యక్తిగతాలు మనోభావాలు దెబ్బతింటున్నాయంటూ పచ్చి బూతు పురాణానికి తెగబడుతున్నారన్నారు.ఆలయంలోపల ఎంత పవిత్రమైన వ్యక్తిగత స్వభావాన్ని కనబరుస్తామో భాహ్య ప్రదేశంలో కూడా అదే రకమైన వ్యక్తిగత స్వభావాన్ని కనపరచాల్సి ఉంటుండగా లోన లోటారం పైన పటారం అనే విధంగా పచ్చి తాగుబోతులు పిచ్చి వాళ్లకన్నా హీనంగా ప్రదర్శిస్తూ ఇటు దేవాదాయ శాఖ అటు ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారన్నారు.నీతిమాలిన పనులకు స్థానిక నేతలను చూసుకొని రెచ్చిపోతున్నారన్నారు.నాయకుల భక్తి పై ... పై... కి కొనసాగుతుందో తెలియదు గానీ ప్రతి నాయకుడు దైవభక్తి పేరుమీద దారుణమైన తూర్పార్బును అందిస్తూ అధికారులకు చ్చిపిచ్చిగా సహకరిస్తున్నారు.కొన్నిచోట్లలోనైతే పోలీస్ అధికారులను బెదిరిస్తూ ప్రశ్నిస్తున్న వ్యక్తులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు.ఆలయాల్లో నిధుల దోపిడీలకు పాల్పడుతూ నిధుల అక్రమాలకు పాల్పడుతూ ఆదాయానికి మించిన ఆస్తులను సంపాదిస్తున్న ఆలయ సిబ్బందిని ఉద్యోగులను రాష్ట్రవ్యాప్తంగా గుర్తించి కఠినంగా శిక్షించకపోతే దైవభక్తికి దైవ విశ్వాసానికి హిందూ ధర్మానికి విలువలు లేకుండా పోయే ఆస్కారాలున్నాయన్నారు. రాష్ట్ర మొత్తంలో రహస్యంగా అవినీతికి పాల్పడుతూ ఆదాయానికి మించిన ఆస్తులు సంపాదించుకొని భవనాల రూపంలో భూ స్థలాల రూపంలో కార్ల రూపంలో బ్యాంకు బాలన్స్ ల రూపంలో బినామీ ఆస్తులు దారుల రూపంలో దేవాలయాల భూములను అమ్ముకుంటూ వచ్చిన సొమ్మును పోగు చేసుకుంటున్నా రూపంలో పలు విధాలైనటువంటి ఆస్తులు సంపాదిస్తున్న అధికారులను దేవాదాయ శాఖ విజిలెన్స్ అధికారులతో పాటు ప్రభుత్వ విజిలెన్స్ శాఖలను రంగంలోనికి దింపి కఠినాతి కఠినంగా రక్షించాలన్నారు.అదే క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అయినవోలు మండలంలోని శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయపు అధికారులైన ఈవో అద్దంకి నాగేశ్వరరావు,జూనియర్ అసిస్టెంట్ అద్దంకి కిరణ్ కుమార్ అక్రమాస్తులు సంపాదించారని వాళ్లపై చర్యలు తీసుకోవాలంటూ జయగిరి జగన్ రాష్ట్ర విజిలెన్స్ కమిషన్ ఆశ్రయించి జూన్ 12న లిఖితపూర్వకమైన వినతి పత్రం సమర్పించగా నేటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో తక్షణంగా విచారణ కొనసాగిస్తూ చర్యలు చేపట్టే క్రమంలో జై భీమ్ అధినేత డాక్టర్ బరిగెల శివ ఆదేశాల మేరకు జై భీమ్ పత్రిక స్టేట్ బ్యూరో రాష్ట్ర దేవాదాయ శాఖ విజిలెన్స్ అధికారి కృష్ణవేణిని వివరాల కొరకు సంప్రదించగా విచారణ విషయమై స్పందిస్తూ తన కార్యాలయానికి మల్లన్న ఆలయ అధికారులు ఈవో జూనియర్ అసిస్టెంట్ పై వినతిపత్రం వచ్చిన మాట వాస్తవమేనని అంగీకరిస్తూ వాళ్ళు ఇరువురిని బదిలీ చేయిస్తూ వాళ్ళ ఆస్తులపై, ఉద్యోగాల్లో చేరిన విధానాలపై పూర్తి విచారణ కొనసాగించి విజిలెన్స్ అధికారులు విచారించిన ఆధారాల మేరకు ఖచ్చితమైన చర్యలు చేపడతామని కరాకండిగా చెప్పారు.అదే క్రమంలో రాష్ట్రంలో ఏ ఆలయంలోనైనా అక్రమంగా అవినీతిపరంగా ఆస్తులు సంపాదిస్తున్న అధికారుల జాబితాలను సామాన్య లేగానీ ప్రజలేగానీ ఎలాంటి భయాందోళనలు చెందకుండా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపినారు.తప్పులకు పాల్పడుతూ భక్తుల విశ్వాసాలకు అసౌకర్యాలు కల్పిస్తున్న అధికారులు ఆదాయానికి మించిన ఆస్తులను సంపాదిస్తున్నట్లు వినతి పత్రంలో పేర్కొన్న విధంగా తక్షణమే విజిలెన్స్ విచారణ కొనసాగిస్తూ తగు చర్యలు చేపడతామని తెలిపారు.దీన్నిబట్టి చూస్తే తెలంగాణ రాష్ట్రంలో దేవాదాయ విజిలెన్స్ శాఖ రాజకీయ నాయకులకు ఆలయాల అధికారులకు ప్రాధాన్యత ఇవ్వకుండా అక్రమంగా ఉద్యోగంలో చేరి ఆలయాల సొమ్మును ఆర్జిస్తూ అందలం ఎక్కుతూ ఆదాయానికి మించిన ఆస్తులు సంపాదిస్తున్న ప్రతి ఉద్యోగిపై, ప్రతి అధికారిపై ఊహకందని చర్యలు తీసుకొని విశ్వాసుల అమూల్యమైన విలువలకు ప్రాధాన్యత నివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు.

**ఈవోల చేతుల్లో ఎక్కడలేని అధికారాలు త్వరలో..**



# బిజెపికి తొత్తుగా ఎన్నికల సంఘం

**ఓట్ల దొంగతనానికి ఇసి సహకారం**
**తన ఆరోపణలపై ఇసి ఎందుకు మౌనం**
**వెంటనే ప్రజలకు నిజాలు వెల్లడించాలి**
**బెంగళూరు సమావేశంలో రాహుల్ తీవ్ర విమర్శలు**



**బెంగళూరు,ఆగస్ట్ 8(జై భీమ్ న్యూస్ ):**

ఎన్నికల సంఘం తన బాధ్యతల్ని విస్మరిస్తోందని, రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన సంస్థ ఇప్పుడు బీజేపీకి అనుకూలంగా పనిచేస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఓట్లను దొంగిలించేందుకు ఎన్నికల సంఘం సహకరిస్తోందని ఆయన విమర్శించారు. బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం మరోసారి ఎన్నికల సంఘాన్ని తీవ్రంగా విమర్శించారు.ప్రజాస్వామ్యాన్ని రక్షించాలంటే ప్రజలు చైతన్యంతో ఉండాలని, ఈ ఎన్నికల్లో న్యాయం నిలవాలంటే అధికార యంత్రాంగం కక్ష సాధింపులు చేయకుండా వ్యవహరించాలంటూ రాహుల్ గాంధీ హితవు పలికారు. అంతేకాదు, కర్ణాటకతో పాటు- ఇతర రాష్ట్రాల్లో కూడా ఇలాంటి మోసాలు జరుగుతున్నాయని ఆయన హెచ్చరించారు. ఈ క్రమంలో మీరు రాజ్యాంగాన్ని తాకాలని అనుకుంటే, ఒకసారి ఆలోచించాలని సూచించారు. ఈ విషయంలో మీరు ఎంత తెలివిగా దాక్కున్నా, మేము మిమ్మల్ని పట్టుకుంటామన్నారు. ఇందుకు కొంచెం సమయం పట్టొ-చ్చు, కానీ తప్పకుండా పట్టుకుంటామని రాహుల్ గాంధీ ఎన్నికల సంఘానికి వార్నింగ్ ఇచ్చారు. ఎన్నికలు దేశ గుండె చప్పుడని, అలాంటి క్రమంలో ఒక్క ఓటు-దొంగిలించబడినా అది జనాభా గొంతును నొక్కేయడమేనని వ్యాఖ్యానించారు. కర్ణాటకలో ఇలాంటి ఘటనలు జరిగితే, అది రాష్ట్ర ప్రజలకు మాత్రమే కాదు, దేశ వ్యాప్తంగా డెమాక్రసీకి సవాల్గా మారుతుందన్నారు. నిజంగానే ఎన్నికల సంఘం ఎవరి పక్షం వైపు ఉందని ప్రశ్నలు పలువురిలో వచ్చే అవకాశం ఉంది. ఇది ఒక్క కర్ణాటక సమస్య మాత్రమే కాదు. దేశవ్యాప్తంగా ఎన్నికల సమగ్రత గురించి చర్చకు దారితీస్తుంది. కానీ, రాహుల్ గాంధీ ఇక్కడితో ఆగలేదు. ఆయన రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, దాన్ని కాపాడటానికి తాము ఎంతకైనా సిద్ధమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘానికి రాహుల్ గాంధీ ఐదు ప్రశ్నలు సంధించారు. డిజిటల్ ఓటర్ల జాబితాను ఎందుకు దాచి పెడుతున్నారు?. సీసీ ఫుటేజీని ఎందుకుఎవరి ఆదేశాలతో తొలగిస్తున్నారు? నకిలీ ఓట్ల నమోదును ఎందుకు అడ్డుకోలేకపోతున్నారు. విపక్షాలను ఈసీ ఎందుకు భయపెడుతోంది. భాజపా ఏజెంట్గా ఈసీ మారిపోయిందా?అంటూ ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భారత ప్రజాస్వామ్యం ఎంతో అమూల్యమైనదని ఈ సందర్భంగా రాహుల్ అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో బెంగళూరు సెంట్రల్ లోక్సభ స్థానంలోని మహదేవపుర అసెంబ్లీ స్థానంలో లక్ష కంటే ఎక్కువ దొంగ ఓట్లున్నాయి. ఎన్నికల సంఘం బిజెపితో కుమ్మక్కయ్యిందని రాహుల్ ఆరోపించారు. 40 మందితో కూడిన బృందం ఆరు నెలలపాటు- నిర్వహించిన విశ్లేషణలో వేలాది నకిలీ ఎంట్రీలు, నకిలీ చిరునామాలు చెల్లని ఫొటోలు, అనుమానాస్పద ఫారం 6 దరఖాస్తులు బయట పడ్డాయని రాహుల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున ఖర్గే, కెసి వేణుగోపాల్, సిఎం సిద్ధరామయ్య, డిప్యూటి సిఎం డికె శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే రాహుల్ ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పందించింది. తను చేసే వాదనలను ధృవీకరిస్తూ అధికారిక ప్రకటనపై సంతకం చేయాలి లేదా దేశానికి క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేత రాహుల్గాంధీకి ఎన్నికల సంఘం సవాల్ విసిరింది. రాహుల్ గాంధీ దగ్గర రెండు ఆప్షన్లే ఉన్నాయి. ఒకటి ఆయన చేసే ఆరోపణలు నిజమనుకుంటే.. డిక్లరేషన్పై సంతకం చేయడం లేదా.. ఇసిఐపై అసంబద్ధ ఆరోపణలు చేసినందుకు దేశానికి క్షమాపణలు చెప్పడం అని ఎన్నిక సంఘం వర్గాలు తెలిపాయి.

# మహిళలకు సిఎం రేవంత్ రాఖీ శుభాకాంక్షలు

**హైదరాబాద్,ఆగస్ట్ 8(జై భీమ్ న్యూస్ ):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని మహిళలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని అన్నారు. మహిళల సాధికారతతో పాటు- మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు, పథకాలు అమలు చేస్తోందని అన్నారు. గృహజ్యోతి, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరా క్యాంటీ-న్లు,ఇందిరమ్మ ఇళ్ల మంజూరులోనూ మహిళలకే పెద్దపీట వేయడం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో మహిళలందరూ భాగస్వాములయ్యే వరకు ప్రజా ప్రభుత్వం వారికి అండగా ఉంటుందన్నారు. మహిళల రక్షణ, భద్రత విషయంలో ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతుందని, మహిళల అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఎక్కడా రాజీ పడేది లేదని అన్నారు. అక్కా చెల్లెళ్లందరికీ తమ ప్రభుత్వం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని, అందరి దీవెనలతో విజయవంతంగా ప్రజా పాలన సాగిస్తుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.

# 14మందికి ఐపిఎస్లుగా పదోన్నతి

**అమరావతి,ఆగస్ట్ 8(జై భీమ్ న్యూస్ ) :**

కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖకు చెందిన 14 మందికి ఐపీఎస్లుగా పదోన్నతులు కల్పిస్తూ..కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఐపీఎస్లుగా ఎన్ని-కై-నా అభ్యర్థులు ఒక సంవత్సరం పాటు- ప్రొబేషన్లో ఉండాలని సూచించింది. యూపీఎస్సీ ఛైర్మన్ అధ్యక్షతన పదోన్నతి కమిటీ- పదోన్నతులకు ఆమోదం తెలిపింది. 2010 గ్రూప్-1 బ్యాచ్కు చెందిన చౌడేశ్వరి, లక్ష్మీనారాయణ, ఈశ్వర్రావు, హిమావతి, లావణ్య లక్ష్మి, వెంకటరత్నం, లత మాధురి, సురేష్ బాబు, కరీముల్లా షరీఫ్, సత్తిబాబు, సుప్రజ, కృష్ణ ప్రసన్న, శ్రీనివాస్, కె.శ్రీనివాస్లకు కన్ఫర్డ్ ఐపీఎస్లుగా పదోన్నతి ఇచ్చింది.దీనికి సంబంధించిన అధికారిక గెజిట్ నోటిఫికేషన్ను ఇవాళ కమిటీ- విడుదల చేసింది.

# సంపాదకీయం

## ట్రంపరితనంను ఎదురించాల్సిందే !

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హద్దుమీరి ప్రవర్తిస్తున్న తీరు మరోమారు ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఏ దేశం ఎవరితో దోస్తానా చేయాలో..ఎవరితో వాణిజ్యం చేయాలో అన్న ఆంక్షలు విధించే హక్కు ట్రంప్‌కు ఎక్కడిదని ప్రశ్నించాలి. ఈ విషయంలో మోడీ దేశ సార్వభౌమాధికారాన్ని నిలబెట్టాలి. ట్రంప్ ఆంక్షలను అంగీకరించేది లేదని గట్టిగానే చెప్పాలి. చర్చలు జరిపేది లేదంటున్న ట్రంప్‌తో మనం కూడా అంతే మొండి వైఖరితో ఉండాలి. 140 కోట్ల జనాభా ఉన్న భారత్‌తో పెట్టుకుంటే ఏమవుతుందో చెప్పగలగాలి. ఒకవైపు మనపై వాణిజ్య ఆంక్షలు విధిస్తూ..మరోవైపు పాక్‌ను దువ్వుతున్న తీరు అమెరికా ద్వంద్వ నీతిని తెలియ చేస్తోంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై అమెరికా విధించిన అదనపు సుంకాలు తీవ్ర దుమారం రేపుతున్న వేళ ట్రంప్ ఏ మాత్రం తగ్గేది లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో రెండు దేశాల మధ్య ఓ రకంగా విభేదాలు పొడసూపి నట్లుగానే భావించాలి. ట్రంప్ ఏకపక్ష నిర్ణయాలు భారత్‌కు పరీక్షగా మారాయి. ఈక్రమంలో మోడీ కూడా మనదేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకుంటూనే ముందుకు సాగాలి. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలను తమపై విధించడంతో భారత్ దీటుగా స్పందించింది. తమ దేశంలోని రైతులు, మత్స్యకారులు, పాల ఉత్పత్తుల రంగంలోని వారి ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేసింది. అవసరమైతే ఆ భారాన్ని తామే భరిస్తామని వెల్లడించింది. మరోవైపు భారత్‌పై మరిన్ని ఆంక్షలను విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇక ఆయన విధించిన సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. దీనివల్ల అమెరికాలో కొన్నింటి ధరలు పెరగనున్నాయి. అయితే, అమెరికా అదనపు సుంకాల వల్ల రెండు దేశాల మధ్య తలెత్తిన వివాదం తాత్కాలికమేనని, త్వరలోనే సమసిపోతుందని ప్రవాస భారతీయ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. చర్చలు ఫలించి త్వరలో ఒప్పందం కుదరనుందనే ఆశాభావం వ్యక్తం చేశాయి. 50 లక్షల మంది ప్రవాస భారతీయులు అమెరికా అభివృద్ధిలో భాగస్వాములుగా ఉన్నారని పేర్కొన్నారు. భారతీయ ఉత్పత్తులపై 50శాతం సుంకాలను వేయడాన్ని ఇండియన్‌-అమెరికన్ల నేత, బైడెన్ మాజీ సలహాదారు అజయ్ భుటోరియా ఖండించారు. 'అమెరికాలో తక్కువ ధరలకు లభించే 50శాతం జనరిక్ మందులను భారత్ సరఫరా చేస్తోంది. ఈ సుంకాలు వాటి ధరలను పెంచుతాయి. దీనివల్ల అమెరికాలోని కుటుంబాలు, సీనియర్ సిటిజన్లు, చిన్న వ్యాపారులు ఇబ్బందులు పడతారు. మసాలా దినుసులు, పప్పులు, దీపావళి దుస్తుల ధరలు పెరుగుతాయని పేర్కొన్నారు. దుస్తులు, పాదరక్షల ధరలు 37శాతం దాకా పెరగవచ్చని అభిప్రాయపడ్డారు. ఇది ఎలా ఉన్నా మనం కూడా తగ్గేదేలా లేదన్నట్లుగా వ్యవహ రించాలి. కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ ఇదే విషయాన్ని గుర్తుచేశారు.. ట్రంప్ విధించిన అదనపు సుంకాలపై ప్రధాని మోదీ గట్టిగా సమాధానమిచ్చారు. తమ రైతుల ప్రయోజనాల విషయంలో ఎప్పటికీ రాజీ పడబోమని, దానికి ఎంత మూల్యమైనా చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలే మాకు అత్యంత ముఖ్యం. రైతులు, మత్స్యకారులు, డెయిరీ ఉత్పత్తిదారుల ప్రయోజనాల విషయంలో భారత్ ఎప్పటికీ రాజీ పడబోదు. వారిని కాపాడటం కోసం సుంకాల భారాన్ని సొంతగా భరించడానికీ సిద్ధం అని ప్రధాని స్పష్టం చేశారు. రష్యా నుంచి చమురు కొంటుందన్న కారణంతో భారత్‌పై 50శాతం సుంకాలను విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మరో బాంబు పేల్చారు. తదుపరి మరిన్ని ఆంక్షలను చూస్తారంటూ హెచ్చరించారు. శ్వేతసౌధంలోని ఓవల్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'భారత్‌పై మేం 50శాతం సుంకాలను విధించిన విషయం మీకు తెలుసు. ఆ దేశం రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకునే దేశాల్లో రెండో స్థానంలో ఉంది. తొలిస్థానంలో ఉన్న చైనాకు అతి దగ్గరగా ఉంది. అందుకే భవిష్యత్తులో మరిన్ని ఆంక్షలను చూడబోతున్నారని పేర్కొన్నారు. ట్రంప్ తీరు చూస్తుంటే పిచ్చోడి చేతిలో రాయిలా ఉంది. తన వైఖరిని నెగ్గించుకోవడమే ఆయనకు ముఖ్యంగా ఉంది. ఎలన్ మస్క్ లాంటి వారినే దూరం పెట్టిన ట్రంప్‌కు భారత్ ప్రయోజనాలు ముఖ్యం కాదు. ఇకపోతే ఆపరేషన్ సింధూర్ తరవాత భారత్ సైనికంగా బలపడడంతో కూడా ట్రంప్ తట్టుకోవడం లేదని తెలుస్తోంది. ఇది కూడా ట్రంప్ వైఖరికి కారణం కావచ్చని వశ్లేషిస్తున్నారు. భారత్‌పై గతంలో విధించిన 25శాతం సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. అదనంగా విధించిన మరో 25శాతం ఈ నెల 27వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయి. మన దేశంతోపాటు అనేక దేశాలపై సుంకాలు గురువారం నుంచే అమల్లోకి వచ్చాయి. దీనివల్ల బిలియన్ల కొద్దీ డాలర్లు అమెరికాకు వస్తాయని ట్రంప్ ప్రకటించారు. ఈ సుంకాలు 10శాతం నుంచి 50శాతం దాకా ఉన్నాయి. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత గత పదకొండేళ్లుగా ఇలా ఎప్పుడూ జరగలేదు. అవినీతిరహితంగా పాలన సాగుతుందన్న పేరు వచ్చింది. అలాగే సాహసోపేత నిర్ణయాలు కూడా తీసుకుని సత్తా చాటింది. అయోధ్య, కాశ్మీర్, ట్రిపుల్ తలాక్ విషాయల్లో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. ఇటీవల ఆపరేషన్ సిందూర్ ద్వారా మన సైనిక సత్తా చాటాం. పాక్‌కు గట్టిగా బుద్ది చెప్పాం. ప్రపంచవ్యాప్తంగా భారత్చర్యలకు గట్టి మద్దతు లభించింది. మోడీ సర్కార్ సాహస నిర్ణయాలకు వెనకాడదని రుజువు చేసుకుంది. సర్జికల్ స్ట్రయిక్స్ తరవాత, ఆపరేషన్ సిందూర్తరవాత కూడా పాక్ వైఖరిలో మార్పు రాలేదు. దాయాది దేశాన్ని ప్రపంచంలో దోషిగా నిలబెట్టిన ఘనత మోడీదే అని చెప్పక తప్పదు. ట్రంప్ విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటారో అని దేశం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. ఈ క్రమంలో భారత్ తన సార్వభౌమాధికరం ముఖ్యమని చాటి చెప్పాలి.

## 10న బిజెపిలో చేరుతున్నా: గువ్వల

**హైదరాబాద్,ఆగస్ట్8(జై భీమ్ న్యూస్ ):**

భాజపా సిద్ధాంతం, లక్ష్యం నచ్చే ఆ పార్టీలో చేరనున్నట్లు బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తెలిపారు. భాజపా రాష్ట్ర కార్యాలయానికి వెళ్లిన ఆయన ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుతో భేటీ- అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఆగస్టు 10న భాజపా రాష్ట్ర చీఫ్ రామచందర్‌రావు సమక్షంలో తాను ఒక్కడినే ఆ పార్టీలో చేరుతానని చెప్పారు. అచ్చంపేటలో ఎవరు ఎన్ని సభలు, సమావేశాలు పెట్టుకున్న తనని ఏమీ చేయలేరని వ్యాఖ్యానించారు. బీజెపీలో గువ్వల చేరికను రాంచందర్ రావు అధికారికంగా ప్రకటించారు. గువ్వల ఈనెల 10వ తేదీన కమలం పార్టీలో చేరనున్నారు. ఆయనతోపాటు- మరికొంతమంది బీఆర్ఎస్ నాయకులు కూడా బీజేపీలో చేరే అవకాశం కనిపిస్తోంది. బీఆర్ఎస్‌ను గువ్వల బాలరాజు వీడిన తర్వాత ఆ పార్టీపై సంచలన ఆరోపణలు చేశారు. తనను చంపుతానంటూ వేలాది ఫోన్లు వచ్చాయని, ఇంత జరిగినా బీఆర్ఎస్‌లో ఎవ్వరూ తనను పట్టించుకోలేదని బాలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఫామ్ హౌస్ కేసులో వంద కోట్లకు అమ్ముడు పోయానంటూ తనపై అబాండాలు మోపారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ ఆదేశాల ప్రకారమే తనకు ఇచ్చిన రోల్‌ను ఫాంహౌస్‌లో పోషించానని, ఆ విషయం పార్టీ పెద్దలకూ తెలుసని వెల్లడించారు.

# శ్రావణ పౌర్ణమియే రాఖీ పండగ

### ఇదేరోజు యజ్ఞోపవీత ధారణ

**తిరుమల,ఆగస్ట్8(జై భీమ్ న్యూస్ ):**

శ్రావణమాసంలో అనేక పర్వదినాలు వస్తుంటాయి. విష్ణుమూర్తి జన్మనక్షత్రం శ్రవణం. ఈ నక్షత్రం చంద్రునితో కూడిన మాసం కావడంతో శ్రావణమాసం అంటారు. ఈ మాసంలో వర్షాలు ఎక్కువగా కురుస్తాయి. ఆకాశం మబ్బులతో వెండికొండలను తలపిస్తుంటుంది. పూర్వకాలం వేద అధ్యయనం శ్రావణమాసంలోనే ప్రారంభమయ్యేది. విష్యత్‌పురాణంలో రక్షాబంధన్ గురించి వివరించారు. బలి చక్రవర్తిని విష్ణుమూర్తి దేవతల కోరిక మేరకు బంధిస్తాడు. అయితే ఈ బంధం అతనికి రక్షణగా నిలుస్తుందని వరమిచ్చినట్టు తెలుస్తోంది. పాల్కురికి సోమనాధుడు ఈ పౌర్ణమిని నూలి పున్నమిగా అభివర్ణించాడు. కర్ణాటకలో నారికేళ పున్నమిగా పండగ నిర్వహిస్తారు. శ్రావణ పూర్ణిమను భారతదేశమంతా స్థానిక సంప్రదాయాల నేపథ్యంలో వేడుకగా నిర్వహిస్తుంటారు. నార్లీ పండగ, నూలి పున్నమి ఇలా రకరకాల పేర్లతో పిలుస్తుంటారు. భారతావనిలో శ్రావణ పౌర్ణమిని పర్వదినంగా పాటించడం వేదకాలం నుంచీ ఉంది. వేదాధ్యయనం చేసేవారు ఉపాకర్మ అనే పేరుతో శ్రావణ పౌర్ణమి రోజున విశేష కార్యాలను నిర్వర్తిస్తుం దేవారు. వారి నియమాలలో ఒకటైన యజ్ఞోపవీతధారణకు ఈ రోజున ప్రాధాన్యాన్ని ఇస్తుండేవారు. ఉపనయనం అనే విధి సంస్కారం దీనికి ఆధారంగా ఉండేది. యజ్ఞోపవీతాన్నే యజ్ఞ సూత్రం అని కూడా అంటారు. ఈ పౌర్ణమినాడు మహారాష్ట్ర, కర్ణాటక వంటి రాష్టాల్లో సముద్రతీర వాసులు సముద్రం దగ్గరకు వెళ్లి సముద్రుడిని పూజించి కొబ్బరికాయలను కొడతారు. అందుకే దాన్ని నార్లీ పౌర్ణమి అనిపిలుస్తారు. వేదకాలంలో ఇది సాక్షాత్తు విష్ణుశక్తి స్వరూపంగా ఉన్నట్లు తెలుస్తోంది. రక్షా బంధాన్ని ఇప్పట్లోలా సోదరి, సోదరుడికి కట్టడమనేది తొలిరోజుల్లో ఉండేది కాదు. భర్త చేతికి భార్య కట్టేది. శత్రు జయాన్ని కలిగిస్తాయన్న నమ్మకంతో ఆవాలు, అక్షతలను వేసి పొట్లం కట్టేవారు. ఆవాలు, అక్షితలను రక్షాద్రవ్యం అనేవారు. ఈ రక్షాద్రవ్యాలున్న పొట్లాన్ని ఒక పరిశుభ్రమైన వస్త్రంలో ఉంచి మూటకట్టేవారు. దాన్ని పీఠంపై ఉంచి పూజించిన తర్వాత దాన్ని పురోహితుడితో చేతికి కట్టించుకునేవారు. పూజ చేసిన ఆ పొట్లం విష్ణుశక్తికి ప్రతిరూపమని నమ్మకం. ఆరోజుల్లో రాక్షసులకు, దేవతలకు చాలాకాలం యుద్ధం జరిగింది. రోజురోజుకూ దేవతల శక్తి సన్నగిల్లడం చూసిన ఇంద్రుని భార్య శచీదేవి శ్రావణ పౌర్ణమి నాడు విధివిధానంగా రక్షను రూపొందించి విష్ణుశక్తి స్వరూపమైన ఆ రక్ష మహిమను, శ్రావణ పౌర్ణమి విశేషాలను వివరించి దాన్ని ఇంద్రుడి చేతికి కట్టింది. ఆ తర్వాతే ఇంద్రుడు రాక్షసులను జయించగలిగాడు... ఇలా ఆనాడు ఒక భార్య భర్త చేతికి రక్షా బంధాన్ని కట్టిన సందర్భం ఉంది. కాలక్రమంలో ఆవాలు, అక్షతలు వేసి పూజించి కట్టిన పొట్లం నేడు రాఖీకి మధ్యలో పువ్వుగానో, కుచ్చుగానో మారిపోయి ఉండవచ్చని చెబుతారు. తర్వాత కాలంలో ఇది అన్నకు చెల్లెలు రాఖీగా కట్టే సంప్రదాయంగా మారిపోయి ఉండవచ్చు.



# మాటల్లేవు.. మాట్లాడుకోవడాలు లేవు

### భారత్‌పై సుంకాల విషయంలో ట్రంప్ మంకుపట్టు

**వాషింగ్టన్,ఆగస్ట్8(జై భీమ్ న్యూస్ ):**



భారీ సుంకాలతో భారత్‌పై అన్యాయంగా కాలుదువ్వుతున్న ట్రంప్ తాజాగా మరో బాంబు పేల్చారు. భారత్‌తో వాణిజ్య చర్చలు ఉండవని స్పష్టం చేశారు. దీంతో, భారత్‌- అమెరికా సంబం ధాలు మునుపెన్నడూ చూడని స్థాయిలో పతనమై ఆందోళన రేకెత్తిస్తున్నాయి. భారత్‌పై సుంకాల విధింపు అనంతరం చర్చలు కొనసాగుతాయా? అన్న మీడియా ప్రశ్నకు ట్రంప్ ఉండవని తెలిపారు. 'విషయం కొలిక్కి వచ్చేంత వరకూ చర్చలు ఉండవు' అని స్పష్టం చేశారు. అంతకుముందు కూడా భారత్‌పై ట్రంప్ రెచ్చి పోయారు. రష్యాతో వాణిజ్యం నెరపే దేశాలపై మరిన్ని సుంకాలు ఉంటాయని హెచ్చరించారు. ఇతర దేశాలూ రష్యాతో వాణిజ్యం జరుపుతుండగా భారత్‌పైనే అక్కసు ఎందుకని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ట్రంప్ ఈ మేరకు సమాధానం ఇచ్చారు. భారతీయ ఉత్పత్తులపై అమెరికా ఇప్పటికే 25 శాతం సుంకం విధిస్తోంది. అదనంగా మరో 25 శాతం సుంకం విధిస్తూ ట్రంప్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. కొత్త సుంకాలు ఆగస్టు 27 నుంచి అమల్లోకి రానున్నాయి. దీంతో, భారత్‌పై మొత్తం సుంకం 50 శాతానికి చేరుకుంది. అమెరికా చర్యలను భారత్ ఖండించింది. సుంకాల విధింపు అన్యాయం, నిర్హేతుకర, చట్టపరంగా సమర్థనీయం కాదని తేల్చి చెప్పింది. జాతీయ ప్రయోజనాల పరిరక్షణకు తాము అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఈ విషయంలో మా వైఖరిని ముందే స్పష్టం చేశాం. మా దిగుమతులన్నీ మార్కెట్ పరిస్థితులు, 1.4 బిలియన్‌ల భారతీయులకు ఇంధన భద్రత అందించడంపై ఆధారపడి ఉంటాయి' అని విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. అమెరికా సుంకాలపై ప్రధాని మోదీ కూడా ఘాటుగా స్పందించారు. గురువారం ఎమ్‌ఎస్ స్వామినాథన్ సెంటెనరీ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో ప్రసంగించిన ప్రధాని.. దేశ ప్రయోజనాల కోసం తాను వ్యక్తిగతంగా ఎంతటి మూల్యం చెల్లించుకునేందుకైనా సిద్ధమేనని అన్నారు. ప్రభుత్వానికి దేశ ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేశారు. రైతులు, మత్స్యకారులు, డెయిరీ రంగం విషయంలో భారత్ రాజీ పడదని స్పష్టం చేశారు.అమెరికా అనుసరిస్తున్న ద్వంద్వ ప్రమాణాలను కూడా భారత్ ఎండగట్టింది. రష్యా చమురును కొనుగోలు చేస్తున్న చైనా, టర్కీపై సుంకాలు ఎందుకు విధించట్లేదని ప్రశ్నించింది. ఇక చైనా ఉత్పత్తులపై గతంలో ప్రకటించిన 145 శాతం సుంకాలను అమెరికా ఇప్పటికీ అమలు చేయని విషయాన్ని కూడా భారత్ ప్రస్తావించింది.

## లిక్కర్ కేసులో జగన్ అరెస్ట్ ఖాయం

### ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి వ్యాఖ్యలు

**రాజమండ్రి,ఆగస్ట్8(జై భీమ్ న్యూస్ ):**

లిక్కర్ కుంభకోణంలో జగన్ అరెస్ట్ ఖాయమని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలో పెట్టుబడులు రాకూడదని జగన్ ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. మళ్లీ తానే అధికారంలోకి వస్తానన్న భ్రమలో జగన్ ఉన్నారని ఎద్దేవా చేశారు. జగన్ ఎప్పుడు అరెస్టు అవుతారో డేట్ చెప్పలేమని, అరెస్ట్ మాత్రం ఖాయమని తెలిపారు.గత 78 ఏళ్లలో ఎప్పుడులేని విధంగా కేంద్ర ప్రభుత్వం ఏపీకి పూర్తి సహకారం అందిస్తుందని బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం హయాంలో ఏపీ అభివృద్ధి పథంలో ముందుకెళ్తుందని అన్నారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలు తనను ఓడించినందుకు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కాకూడదనే మనస్తత్వంతో మాజీ సీఎం జగన్ ఉన్నారని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఆరోపించారు. లిక్కర్ కేసు నిందితులు బిగ్‌బాస్ ఎవరో చెప్పినట్లు-గా సిట్ వద్ద వీడియో ఆధారాలు ఉన్నాయని స్పష్టం చేశారు. అప్పట్లో చంద్రబాబుని ఎలాంటి ఆధారాలు లేకుండా అరెస్టు చేశారని గుర్తు చేశారు. వైసీపీ మునిగిపోయే నావ, అందుకే ఆ పార్టీ కార్యక్రమాల్లో సీనియర్ నేతలు పాల్గొనడం లేదని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.

## గ్యాస్ సిలిండర్ పేలుడు కుటుంబాలకు పరిహారం

**విశాఖపట్టణం,ఆగస్ట్8(జై భీమ్ న్యూస్ ):**

విశాఖ గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. విశాఖ ఫిషింగ్ హార్బర్ సమీపంలోని ఓ వెల్డింగ్ దుకాణంలో గ్యాస్ సిలిండర్ పేలి ముగ్గురు మృతిచెందారు. మరో ముగ్గురు కొన ఊపిరితో ఆసుపత్రిలో కొట్టు-మిట్టాడుతున్నారు.

## చౌకబారు విమర్శలపై క్షమాపణలు చెప్పాలి

### బండి సంజయ్‌కు కెటిఆర్ హెచ్చరిక

**హైదరాబాద్,ఆగస్ట్8(జై భీమ్ న్యూస్ ):**

ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణల్లో నిజం ఉంటే నిరూపించాలని సంజయ్‌కు సవాల్ విసిరారు. లేదంటే 48 గంటల్లో వ్యాఖ్యలు ఉపసంహరించుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే లీగల్ నోటీ-సులు పంపుతానని హెచ్చరించారు.ఇంటెలిజెన్స్ విభాగంపై ఆయనకు కనీస పరిజ్ఞానం లేదని, కేంద్ర హోంశాఖ సహాయమంత్రిగా పని చేస్తున్నప్పటికీ.. ఆయనకు ఆ మాత్రం పరిజ్ఞానం లేకపోవడం విచారకరమని అన్నారు. ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందిస్తూ.. ఇంటెలిజెన్స్ విభాగం ఎలా పని చేస్తుందో సంజయ్ అర్థం చేసుకోలేరు. నిర్లక్ష్యంతో ఆయన చేసిన ప్రకటనలు హద్దు మీరాయి. చౌకబారు ఆరోపణలతో ఆయన మరింత దిగజారారు. రాజకీయ ఉనికి కోసం రోడ్లపై చౌకబారు నాటకాన్ని ఎంచుకున్నారని విమర్శించారు.

# భారీవర్షాలతో నగరంలో ఇక్కట్లు

### అప్రమత్తంగా ఉండాలి సిఎం ఆదేశం
### పొంగిప్రవహిస్తున్న మూసీ నది
### ఈదులవాగులో కొట్టుకు పోతున్న కారును కాపాడిన స్థానికులు

**హైదరాబాద్,ఆగస్ట్8(జై భీమ్ న్యూస్ ):**

హైదరాబాద్ నగరంలో వర్షాలతో తలెత్తుతున్న ఇబ్బందులు, వరద సమస్యకు శాశ్వత పరిష్కారంపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షించారు. భారీ వర్షాల నేపథ్యంలో తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడా ప్రాణ నష్టం లేకుండా చూడాలన్నారు. సమీక్షకు సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి,సెక్రటరీ ఇలంబర్తి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, ఈవీ నర్సింహా రెడ్డి, జేఎండీ పి.గౌతమి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఇదిలావుంటే హైదరాబాద్‌లో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి యాదాద్రి భువనగిరి జిల్లాలో మూసీ ఉధృతంగా ప్రవహిస్తోంది. వలిగొండ మండలం సంగెం సమీపంలోని భీమలింగం వద్ద లోలెవల్ బ్రిడ్జి పై నుంచి మూసీ ప్రవాహం కొనసాగుతోంది. వరద ప్రవాహం ప్రమాదకర స్థాయిలో ఉండటంతో వంతనపై ఎవరూ ప్రయాణించకుండా పోలీసులు బ్రిడ్జికి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో సంగెం పరిసర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భువనగిరి నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం భారీ వర్షం కురిసింది. బీబీనగర్ మండలం రుద్రవెల్లి వద్ద బ్రిడ్జి కింద నుంచి మూసీ ప్రవహిస్తోంది. రంగారెడ్డి, హైదరాబాద్. యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురవడంతో మూసీ నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. చౌటుప్పల్ మండలంలో ఈదుల వాగు పొంగి ప్రవహించడంతో కారు కొట్టుకుపోయింది. స్థానికులు గమనించి ఏడుగురిని స్థానికులు కాపాడారు. కారు ఈదుల వాగు నుంచి వెళ్తుండగా ఒక్కసారిగా వరదలో కొట్టుకుపోయింది. స్థానికులు తాడు వేసి ఏడుగురిని బయటకు లాగారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. యాదాద్రి భువనగిరి జిల్లా సంగం భీమలింగం దగ్గర మూసీ లెవెల్ వంతెన పైనుంచి ప్రవహిస్తుంది. మూసీ నది వంతెనపై రాకపోకలను అధికారులు నిలిపివేశారు. హిమాయత్ సాగర్ రిజర్వాయర్ నీటి మట్టం పూర్తిస్థాయికి పెరగడంతో నాలుగు గేట్లు ఎత్తి దిగువకు నీటిని అధికారులు విడుదల చేశారు. దీంతో మూసీ ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో పరీవాహక ప్రజలకు అధికారుల హెచ్చరికలు జారీ చేశారు. హుస్సేన్ సాగర్ కూడా పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరింది.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem

# ఆగస్టు 12 ప్రపంచ గిరిజన హక్కుల దినోత్సవాన్ని జయప్రదం చేయండి

**తెలంగాణ గిరిజన సంఘం విజ్ఞప్తి**

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

తెలంగాణ గిరిజన సంఘం విజ్ఞప్తి ఐక్యరాజ్యసమితి పిలుపులో భాగంగా ఆగస్టు 9న గిరిజన తెగలు తమ హక్కుల కోసం ప్రపంచ గిరిజన దినోత్సవాన్ని జరుపుకోవాలని పిలుపునిచ్చింది. అందులో భాగంగా తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో తండాలు, మండల కేంద్రాల్లో ఆగస్టు 9 నుండి 13 వరకు జరుగుతున్న జెండా ఆవిష్కరణలు, ప్రదర్శనల్లో గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం హనంకొండ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పల్లకొండ శ్రీకాంత్, వి వీరన్న నాయక్ లు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వి.వీరన్న నాయక్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా గిరిజన తెగల ఉనికి ప్రమాదంలో పడుతోందని, వారికి ఉన్న హక్కులు క్రమంగా కోల్పోతూ కోట్లాదిమంది నిరాశ్రయులుగా మారుతున్న తరుణంలో గిరిజన హక్కులను కాపాడుకునేందుకు ప్రభుత్వాలు, గిరిజన హక్కుల సంఘాలు పూనుకోవాలని 1994లో ఐక్యరాజ్యసమితి తీర్మానించింది. ఆగస్టు 9న ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని రకాల గిరిజన తెగలు ప్రపంచ హక్కుల దినంగా జరుపుకోవాలని పిలుపునిచ్చి. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం ఈ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్న కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం లేదని తెలిపారు. రాజ్యాంగంలోని గిరిజన హక్కులను కాపాడుకుందాం,అడవులు, భూముల నుండి గిరిజనులను గెంటివేయడాన్ని ఆపాలి, గిరిజనులకు ఇచ్చిన హామీల అమలుకై పోరాడుదాం అనే నినాదాలతో ప్రపంచ ఆదివాసి గిరిజన హక్కుల దినోత్సవాన్ని జరుపుతున్నట్లు తెలిపారు.కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి రాజ్యాంగంలో గిరిజనులకు కల్పించిన హక్కులు, చట్టాలను గతంలో ఎన్నడులేని విధంగా కాలరాసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. అడవులు, అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టపెట్టేందుకు గిరిజన హక్కులను కాలరాస్తూ నూతన అటవీ సంరక్షణ చట్టం 2023ను ఆమోదించిందన్నారు. దీనివలన దేశంలో కోట్లాదిమంది గిరిజనులు అడవుల నుండి గెంటి వేయబడి నిరాశ్రయులుగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఇతర మతాల ప్రభావం వలనా తరతరాలుగా గిరిజను కాపాడుకుంటూ వస్తున్న సంస్కృతి,భాష,ప్రకృతి ఆరాధనా వంటి ఆచారాలు కనుమరుగవుతున్నాయని అన్నారు. గిరిజన తెగల ఉనికిని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం 2027లో చేపట్టబోయే జనాభా లెక్కల మతం కాలంలో షెడ్యూల్ ట్రైబ్ విశ్వాసాలు లేక ప్రకృతి ఆరాధికులు అనే ప్రత్యేక కాలాన్ని పొందుపరచాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గిరిజనులకు ఇచ్చిన 16 రకాల వాగ్దానాలను తక్షణం అమలు చేసేందుకు తక్షణం కార్యాచరణ ప్రకటించాలన్నారు.ఇచ్చిన వాగ్దానాల్లో ఒక్కటి కూడా అమలు చేయకుండా కాలయాపన చేస్తూ గిరిజనులను మోసం చేస్తుందని విమర్శించారు. సామాజిక న్యాయాన్ని అమలు చేస్తున్నామని గొప్పలు చెపుతున్న ప్రభుత్వం ఇప్పటివరకు గిరిజన శాఖకు గిరిజన మంత్రిని నియమించలేదని విమర్శించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న గిరిజన వ్యతిరేక విధానాలపై రాబోయే కాలంలో పోరాడేందుకు గిరిజనులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు. సిద్దు లాలూ డీజే లాలూ తిరుపతి రమేష్ వీరన్న శారదా నముకు లలిత జిల్లా కార్యదర్శి వాంకుడోత్ వీరన్న నాయక్ తెలంగాణ గిరిజన సంఘం తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రంలో అర్హులైన ప్రతి నిరుపేద సొంతింటి కలను సాకారం చేస్తున్నాం

**రాష్ట్రవ్యాప్తంగా పురోగతిలో వివిధ దశల్లో మూడు లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు**
**రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లోని స్లమ్స్ లో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టించే యోచనలో ప్రభుత్వం**
**రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**
**హనుమకొండ బాలసముద్రం అంబేద్కర్ నగర్ లోని 592 రెండు పడక గదుల ఇండ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీనివాస్ రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మేయర్ సుధారాణి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద, తదితరులు.**
**కాళోజి కళాక్షేత్రంలో రెండు పడక గదుల ఇండ్ల లబ్ధిదారులకు ఇండ్ల కేటాయింపు ధ్రువపత్రాలను పంపిణీ చేసిన మంత్రి, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు**

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

రాష్ట్రంలో అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబం సొంతింటి కలను ప్రజా ప్రభుత్వం నెరవేర్చుతుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండలోని బాలసముద్రం అంబేద్కర్ నగర్ లో జి ప్లస్ త్రీ విధానంలో నిర్మించిన 592 రెండు పడక గదుల ఇండ్లను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, నగర మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద లతో కలిసి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. కొబ్బరికాయ కొట్టి శిలా ఫలకాన్ని ఆవిష్కరించి మొదటి బ్లాకును రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. లబ్ధిదారులకు కేటాయించిన ఇండ్లను పరిశీలించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, తదితరులను పలువురు లబ్ధిదారులు నూతన వస్త్రాలను బహూకరించారు. నిరుపేదలమైన తమకు రెండు పడక గదుల ఇండ్లను కేటాయించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించిన ఇందిరమ్మ ఇళ్లు, 2బిహెచ్ కె ఇండ్ల పంపిణీ కార్యక్రమం హనుమకొండలోని కాళోజీ కళా క్షేత్రంలోని ఆడిటోరియంలో నిర్వహించారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, తదితరులు జ్యోతి ప్రజ్వలన చేయగా, మంత్రి శ్రీనివాస్ రెడ్డి కంప్యూటర్ బటన్ ఆన్ చేసి ర్యాండమైజ్ లో లబ్ధిదారులకు ఇండ్ల కేటాయింపు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఇది పేదల ప్రభుత్వమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం గత ప్రభుత్వ హయాంలో ప్రజాధనాన్ని ఖర్చు చేయాల్సినంత ఖర్చు చేసి పేదల కల, ఆశను నెరవేర్చలేదన్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తన వద్దకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పలుమార్లు కలిసి ఇండ్ల పంపిణీ గురించి ప్రస్తావించారని అన్నారు. రెండు పడక గదుల ఇండ్ల కేటాయింపు జరిగిందన్నారు. పేదవారి కలను ప్రజా ప్రభుత్వం సాకారం చేసిందన్నారు. కట్టిన ఆరు సంవత్సరాలైన గత పాలకులు ఇండ్లు ఇవ్వలేదన్నారు. ప్రైమ్ ల్యాండ్ అని, జీవనోపాదికి అన్ని ఆ ప్రాంతంలో ఉన్నాయన్నారు. ఇంకా అర్హులైన పేదవారికి స్లం ఏరియాలో ఉంటున్న వారికి కూడా కేటాయిస్తామని, అలాంటి వారి జాబితాను కలెక్టర్ రూపొందిస్తే అదనంగా ఇండ్లను కేటాయిస్తామన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నాలుగు విడతల్లో అర్హులందరికి ఇళ్లు అందజేస్తామని పునరుద్ఘాటించారు. రాష్ట్రవ్యాప్తంగా రానున్న మూడేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. హన్మకొండలో శుక్రవారం ప్రారంభించిన డబుల్ బెడ్రూం ఇళ్లు ఈ పథకంలో భాగమేనని, పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళ లాంటివని పేర్కొన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల పక్షపాత ప్రభుత్వమని అన్నారు. పేదల సంక్షేమం దృష్ట్యా రాష్ట్రం ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తోందన్నారు. పదేళ్లలో గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదు. పాత రేషన్ కార్డులలో బిడ్డల పేర్లు, కోడళ్ళ పేర్లు నమోదు చేయలేని పరిస్థితి ఉండేదని తెలిపారు. కానీ తెలంగాణ ప్రజా ప్రభుత్వం. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17 లక్షల మంది పాత కార్డులలో కొత్తగా రేషన్ కార్డులలో చేర్చాం. రాష్ట్రవ్యాప్తంగా ఆరు లక్షల మందికి కొత్త రేషన్ కార్డులు ఇచ్చిన ఘనత ఇందిరమ్మ ప్రభుత్వానిదని అన్నారు. ప్రభుత్వం వరి పంట వేసిన ప్రతి రైతుకు మద్దతుగా నిలుస్తూ సన్నధాన్యానికి రూ. 500 రూపాయల బోనస్ ను అందిస్తుందన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను తొమ్మిది రోజుల్లో 9000 కోట్ల రూపాయలను జమ చేసిందన్నారు. పదేళ్ల వరకూ రేషన్ కార్డులు ఇవ్వలేదని, ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలో కి వచ్చిన తరువాత రేషన్ కార్డులు ఇచ్చిందన్నారు. రేషన్ కార్డు దారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, ఇతర జిల్లాల్లోని స్లమ్ ఏరియాలలో ఉంటున్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తామన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ పండగ వాతావరణంలో ఇండ్ల పంపిణీ కార్యక్రమం చేసుకోవడం ఎమ్మెల్యే గా తనకెంతో సంతృప్తిగా ఉందన్నారు. దాదాపుగా అరవై లక్షల వ్యయమైన ఇండ్లను నిరుపేదలకు కేటాయించడం జరిగిందన్నారు.




నిజమైన లబ్ధిదారులకు ఇండ్లను కేటాయించడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. గుడిసెలు వేసుకున్న అందరికి ఇండ్లను కేటాయించామని, ఇంకా ఎవరైనా ఉన్నట్లయితే వారికి తప్పనిసరిగా న్యూశాయంపేటలో కేటాయిస్తామన్నారు. ఇంకా చాలామంది నిరుపేదలున్నారని, శాయంపేట, తదితర ప్రాంతంలో ప్రభుత్వ భూములు గుర్తించి అక్కడ కూడా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేవిధంగా కేటాయించాలని మంత్రి శ్రీనివాస్ రెడ్డి ని కోరారు. ఇండ్లలో తాగునీరు, విద్యుత్, తదితర సౌకర్యాలను కల్పిస్తామని అన్నారు. వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ వరంగల్ నగరాభివృద్ధికి ఇది ఒక మైలురాయని అన్నారు. నిరుపేదల కు సొంతిల్లు ఒక కల, ఆ కలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చిందని అన్నారు. ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య మాట్లాడుతూ గత 10 సంవత్సరాలలో జరగని అభివృద్ధి ని 18 నెలల్లో చేసి చూపించారని అన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్. నాగరాజు మాట్లాడుతూ వరంగల్ నగరాన్ని అభివృద్ధికి ఎమ్మెల్యేలుగా కలిసికట్టుగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. వరంగల్ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో వివిధ అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. ఇటీవల డిల్లీకి వెళ్ళినప్పుడు కూడా వరంగల్ ఎయిర్పోర్ట్, తదితర అభివృద్ధి కి కావాల్సిన నిధులు కు కేంద్ర మంత్రులను కలిసినట్లు పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్ర ప్రజల అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రత్యేక చొరవ తో ఇండ్ల పంపిణీ కార్యక్రమం పారదర్శకంగా చేపట్టడం జరిగిందన్నారు. పేదలు ఎన్నో ఏండ్లుగా ఆశతో ఎదురుచూస్తున్న కల నెరవేరిందన్నారు. పేదల అభివృద్ధి, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుంటే కొందరు కావాలనే నిందలు వేస్తున్నారని అన్నారు. రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని పేదల కళ్ళల్లో ఆనందం చూస్తున్నామని పేర్కొన్నారు. ఇండ్లు పొందిన లబ్ధిదారులకు అభినందనలు తెలిపారు. కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ అత్యంత పారదర్శకంగా కేటాయింపు జరిగిందన్నారు. గుడిసెలు వేసుకున్న వారందరికీ ఇండ్లను కేటాయించినట్లు పేర్కొన్నారు. 592 చదరపు అడుగుల విస్తీర్ణంలో 592 ఇండ్లను నిర్మించినట్లు తెలిపారు. అత్యంత విలువైన స్థలంలో ఇండ్లను నిర్మించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి, జిడబ్ల్యుఎంసి కమీషనర్ చాహత్ బాజ్ పాయ్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, ఇతర సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గోన్నారు.

# భద్రకాళి ఆలయంలో పోటెత్తిన భక్తులు



**వరంగల్ జై భీమ్ న్యూస్**

శ్రావణ మాసం వరలక్ష్మీవ్రతం శుక్రవారం సందర్భంగా భక్తులు శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకోవడానికి దేవాలయానికి పోటెత్తారు. భక్తులు భక్తిశ్రద్ధలతో ఓడిబియ్యం పోసి అమ్మవారికి చీరలు సమర్పించారు. భక్తులు ఉదయం నుండి అమ్మవారి దర్శనమునకు బారులు తీరారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లు, మంచినీరు, ప్రసాద వితరణ ఏర్పాట్లు దేవాలయ చైర్మన్ డా. బి. శివసుబ్రహ్మణ్యమ్, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, గాదె శ్రవణ్కుమార్ రెడ్డి, మోతుకూరి మయూరి రామేశ్వర్రావు, గాండ్ల స్రవంతి, తొగరు క్రాంతి, ఓరుగంటి పూర్ణచందర్, పాలడుగల ఆంజనేయులు, బింగి సతీష్, అనంతుల శ్రీనివాస్ రావు, జారతి వెంకటేశ్వర్లులు పర్యవేక్షించారు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లు ఆలయ ఈఓ రామల సునీత ఏర్పాటు చేశారు. అమ్మవారి దర్శనం అనంతరం ముత్తయిదువలు వాయినాలు ఇచ్చుకున్నారు. శుక్రవారం అమ్మవారిని వరంగల్ పశ్చిమ నియోజక వర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. పూజానంతరం అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు.

# పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆకస్మిక తనిఖీ

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఏ అప్పయ్య**



**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

సీజనల్ వ్యాధులు ముఖ్యంగా దోమకాటు వలన వ్యాపించే మలేరియా, డెంగ్యూ నివారణలో భాగంగా హనుమకొండ ఆరోగ్యశాఖ ద్వారా ప్రజలలో అవగాహన కలిగించేందుకు వినూత్నమైన ప్రయత్నంలో భాగంగా దోమలు పుట్టకుండా, పెరగకుండా, కుట్టకుండా తీసుకోవాలసిన చర్యలను ప్రత్యక్షంగా శుక్రవారం లష్కర్ సింగారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రదర్శించడం జరిగిందని హనుమకొండ డిఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య తెలియ చేశారు. ఇందులో భాగంగా దోమల ఆవాసాలైన టైర్లు, కొబ్బరి బోండాలు, వాడి పడేసిన ప్లాస్టిక్ గ్లాసులు, పూల కుండీలు, ప్లాస్టిక్ వస్తువులతో పాటుగా దోమలు కుట్టకుండా తీసుకునే చర్యలైన దోమతెర వాడుతు వ్యక్తి ప్రశాంతగా నిద్రిస్తున్న విధానాన్ని ప్రదర్శించడం జరిగింది. అలాగే అవగాహన సందేశాలతో కూడిన స్టాండిని ప్రదర్శించడం జరిగింది. కావున మీరు, మేము, మనమందరం తప్పనిసరిగా దోమల నివారణ చర్యలు పాటించి, దోమల నియంత్రణ చర్యలో భాగస్వాములు అవుతూ ఆరోగ్యాన్ని కాపాడుకుందాం తద్వారా ఆరోగ్యపరమైన ఖర్చులను తగ్గించుకుందాం ప్రభుత్వానికి సహకరిద్దాము. ఈ కార్యక్రమంలో అడిష్నల్ డిఎంహెచ్ఓ డాక్టర్.టి. మదన్ మోహన్ రావు, వైద్యాధికారి డాక్టర్ హైదర్, జిల్లా మాస్ మీడియా అధికారివి. అశోక్ రెడ్డి, హెల్త్ సూపర్ వైసర్ బాబు, విప్లవ్ కుమార్, మరియా థామస్, శ్రీనివాస్, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్త లు పాల్గొన్నారు.

**డ్రై డే, జ్వర సర్వే పర్యవేక్షణ..**

డిఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, డాక్టర్ టి. మదన్ మోహన్ రావు లు గోపాల్ పూర్ ప్రాంతంలోని వేంకటేశ్వర కాలనీ లో ఆరోగ్య సిబ్బంది డ్రై డే తో పాటు ఇంటింటి జ్వర సర్వే, ర్యాపిడ్ టెస్ట్ లు నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సంధర్భంగా గృహాలను సందర్శించి వారికి తగిన సూచనలు చేయడం జరిగింది. ప్రజలు తమ ఇంటి చుట్టూ, కాంపౌండ్ ల ప్రక్కన పెరిగిన గడ్డి, చిన్న చిన్న పొదలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం తమ వంతు బాధ్యతగా భావించాలన్నారు.



# కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తున్న నిధుల వివరాలపై పార్లమెంట్ లో ప్రశ్నించిన ఎంపీ కావ్య

**జై భీమ్ న్యూస్ న్యూ ఢిల్లీ**

తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో వైద్య విద్య, ఆరోగ్య సదుపాయాలను మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించాలంటూ పార్లమెంట్ లో వరంగల్‌ఎంపీ డాక్టర్ కడియం కావ్య ప్రశ్నించారు. ప్రధానంగా గ్రామీణ మెడికల్ కళాశాలల్లో డాక్టర్లు మరియు సిబ్బంది, అధ్యాపకుల నియామకాలు, ల్యాబ్స్, లైబ్రరీలు, హాస్టళ్లు, వైద్య పరికరాలు, డయాగ్నస్టిక్ టూల్స్ గ్రామీణ సేవలకు ప్రోత్సాహకాలు వంటి అంశాలపై వరంగల్ ఎంపీ వివరణ కోరారు. లోక్‌సభలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నల కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీమతి అనుప్రియా పటేల్ సమాధానం ఇచ్చారు. కొత్త మెడికల్ కళాశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు 2023 నిబంధనల ప్రకారం తప్పనిసరి చేస్తూ అధ్యాపకుల హాజరు ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ సిస్టమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. 2024%-%25లో ఎన్‌హెచ్‌ఎం కింద తెలంగాణకు 67.16 కోట్లు, ప్రధాన్ మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద రూ. 208.82 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. దూర ప్రాంతాల్లో పనిచేసే డాక్టర్లకు ప్రత్యేక భత్యాలు, నిపుణులకు గౌరవ వేతనాలు ఇస్తున్నామని పేర్కొన్నారు. అలాగే, కేంద్ర పథకం కింద తెలంగాణలోని 9 మెడికల్ కళాశాలలకు 511 పిజి సీట్లు మంజూరయ్యాయని తెలిపారు. వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజ్‌కు 92 సీట్లు కు గాను మొదటి దశల 89 సీట్లకు 7.47 కోట్లు విడుదల చేయాగ, రెండో దశలో 3 సీట్లకు 2.15 కోట్లు విడుదల చేసినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామీణ మెడికల్ కళాశాలల్లో సదుపాయాలను కల్పించడంతోపాటు సిబ్బంది కొరత లేకుండా చూడాలని ఎంపీ కోరారు. మెడికల్ కళాశాలలకు మరిన్ని ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి చేశారు.



# విద్యార్థుల శ్రేయస్సే నాందిగా సుప్రీంకోర్టు సంచలన తీర్పు




**జై భీమ్ న్యూస్ కే.యూ క్యాంపస్**

కొఠారి కమిషన్ అధ్యయనం ప్రకారంగా (1964-66) దేశ భవిష్యత్తు పాఠశాలలో రూపుదిద్దుకుంటుంది. కుటుంబం మరియు పాఠశాలలు పిల్లల్ని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా రూపొందించడంలో ప్రముఖ పాత్ర వహిస్తారు .ఇది ఒక సామాజిక మరియు సాంఘీకీకరణ ప్రక్రియ, మారుతున్న సామాజిక నేపథ్యంలో మరియు ఆధునిక విద్యావిధాన పద్ధతులలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు తమ వంతు పాత్ర పిల్లల ఉజ్వల భవిష్యత్తుకై పోషిస్తారు .ప్రస్తుత పరిస్థితులలో విద్యా అనునది.వ్యక్తిగత మరియు సామాజిక శ్రేయస్సుకు అత్యవశ్యకం. ఈనాడు విద్యార్థులు విభిన్నమైన సబ్జెక్టులను వాటికి సంబంధించిన విషయ అవగాహన పెంచుకునేందుకు తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమైనది ,కానీ కొన్ని ప్రత్యేక కారణాల దృష్ట్యా విద్యార్థులు తమ వంతు అభ్యాసన విధిని పూర్తి చేయలేకపోతున్నారు.అందుకు మనం అనేక కారణాలను గుర్తించవచ్చు ఇందులో భాగంగా విద్యార్థుల మానసిక/ ప్రజ్ఞ స్థాయి ఇంటలిజెంట్ క్వాసెంట్ (ఇంటెలిజెంట్ క్వాసెయింట్). సబ్జెక్టు పై ఇష్టం లేకపోవడం మితిమీరిన లేదా శక్తికి మించిన అభ్యసన పని భారం (హోంవర్క్, వర్క్ బుక్, అసైన్మెంట్స్ )మొదలగునవి. పుస్తకాలు మితిమీరిన బరువు భారము మోత ఇంట్లో తల్లిదండ్రుల యొక్క సహాయ సహకారములు చాలినంతగా లేకపోవడం- ఎందుకనగా తల్లిదండ్రుల యొక్క నిరక్షరాస్యత మొదలగునవి విద్యార్థి ఉపాధ్యాయుని మధ్య సఖ్యత తీరు ఇతర విద్యార్థులతో పోల్చడం,పొంతన పరచడం చివరగా ఆత్మా న్యూణత భావం పెరగడం పై విషయాలన్నింటినీ క్రితం విద్యా కమిటీలు పరిగణలోకి తీసుకొని సలహాలు సూచించిన కానీ ఆర్థిక కారణాల దృష్ట్యా పాఠశాల వ్యవస్థ మరియు నిర్వహణలో చాలినంతగా అభివృద్ధి జరగలేదు . కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో విద్యా విషయమై కమిటీలు సూచించిన ప్రకారంగా బడ్జెట్ ను కేటాయిస్తే పరిస్థితులు మెరుగవుతాయి. తల్లిదండ్రుల ఆశయాలు కోరికలు పిల్లలపై దినదిన ప్రవర్తమానమవ్వడం వల్ల మరియు పాఠశాల యాజమాన్యం కూడా పిల్లల ఫలితాలు ఉత్కృష్టంగా ఉండాలని ఆశించడం వల్ల మరియు తోటి పిల్లలతో పోల్చడం వల్ల విద్యార్థులు ఆందోళనకు గురై అనుకున్న ఫలితాలు సాధించలేని తరుణంలో ఆత్మహత్యకు పాల్పడడం అత్యంత శోచనీయం.పై విషయాన్ని కేంద్ర అత్యున్నత న్యాయస్థానం పరిగణించి దేశస్థాయిలో పాఠశాలలలో/ కళాశాలలలో మానసిక కౌన్సిలర్లను నియమించాలి మరియు ప్రతి వంద మంది విద్యార్థులకి ఒక కౌన్సిలర్ ఉండేట్టుగా విధివిధానాలు రూపొందించి నియామకాలు జరపాలని తత్సంబంధిత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను సూచించడం జరిగింది.

స్కూల్ సోషల్ వర్క్ అభివృద్ధి చెందిన దేశాలలో ఒక వృత్తిగా గుర్తింపబడి పాఠశాలలో స్కూల్ సోషల్ వర్కర్స్ ని నియమించడం జరిగింది ఉదాహరణలుగా అమెరికా బ్రిటన్ లాంటి దేశాలను తీసుకోవచ్చు మొట్టమొదటిసారి భారతదేశ చరిత్రలో అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు విద్యార్థుల శ్రేయస్సుకై ,భవితకై కౌన్సిలర్లను నియమించాలని సూచించడం ద్వారా ప్రొఫెషనల్ స్కూల్స్ సోషల్ వర్కర్స్ యొక్క ఔనత్యాన్ని అవసరాన్ని, గుర్తించడం జరిగిందని చెప్పవచ్చు . 1936 నుండి భారత దేశంలో ప్రొఫెషనల్ సోషల్ వర్కర్స్ ని తయారుచేసి విభిన్న విభాగాలలో ముఖ్యంగా మెడికల్ సైకియాట్రి, ఇండస్ట్రీ ,ఫ్యామిలీ చైల్డ్ వెల్ఫేర్ మరియు కమ్యూనిటీ డెవలప్మెంట్స్ మొదలగు విభాగాలలో బిఎస్డబ్ల్యూ / ఎమ్మెస్ డబ్ల్యూ కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారిని నియమించడం జరిగింది .సోషల్ వర్క్ కోర్సులో భాగంగా స్కూల్ సోషల్ వర్క్ ఒక స్పెషలైజేషన్ గా గుర్తించబడింది. స్కూల్ సోషల్ వర్క్ మరియు కౌన్సిలర్లను తమ యొక్క నైపుణ్యాలును పద్ధతులను వినియోగించి విద్యార్థుల ఉన్నతికి దోహదపడేందుకు స్కూల్ యాజమాన్యం ,తరగతి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు ఇతర సహచర విద్యార్థులతో ఇంటర్వ్యూ ల ద్వారా సంప్రదించి విద్యార్థుల మానసిక ధైర్యాన్ని పెంచుతూ వారి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు రెమిడీయల్ పద్ధతులను సూచిస్తారు. విద్యార్థి సామాజిక ఆర్థిక పరిస్థితులను అంచనా వేయడానికి ప్రొఫెషనల్ సోషల్ వర్కర్లు హోమ్ విజిట్స్ నిర్వహిస్తారు .ఈ విధంగా స్కూల్ సోషల్ వర్కర్స్ కౌన్సిలర్లు ఒక స్నేహితుడిగా ,ఒక మార్గదర్శకుడిగా,ఒక ప్రేరకుడిగా విద్యార్థులకు ఎడ్యుకేషనల్ కౌన్సిలింగ్ నిర్వహిస్తారు తద్వారా విద్యార్థులు పరిపూర్ణమైన ఆశావాహ దృక్పథంతో ,నమ్మకంతో సామర్థ్యంతో వారు అనుకున్న ఉద్దేశాలను సాధించేందుకు అడుగులేస్తారు అందుకని అత్యున్నత న్యాయస్థానం యొక్క తీర్పును శిరసావహిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి మరియు దేశ మనుగడను దృష్టిలో ఉంచుకొని తక్షణమే పాఠశాల/ కళాశాలలో ప్రొఫెషనల్ సోషల్ వర్కర్లను కౌన్సిలర్లుగా నియమిస్తూ తక్షణమే చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది.

(ఈ వ్యాసకర్త ఒక సామాజిక కార్యకర్త మరియు సోషల్ వర్క్ లో మాస్టర్స్ డిగ్రీని కాకతీయ యూనివర్సిటీ లో పూర్తి చేయడం జరిగింది)

ఈ వ్యాసంలో ప్రస్తావించిన విషయాలు వ్యాసకర్త యొక్క అనుభవ పూర్వకమైన స్వీయ సంకలనాలు.

గమనిక: కళాశాలను కూడా స్కూల్ గా వ్యవహరించే సంప్రదాయం వేరే దేశాలలో ఉంది ఉదాహరణకు : స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ మొదలగునవి.

వ్యాసకర్త :
**తిరుపతి నాయక్**
కాకతీయ యూనివర్సిటీ,
సెల్: 8074787481



# పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాని పర్యవేక్షించిన డెమో అనిల్





**వరంగల్ జిల్లా జై భీమ్ న్యూస్**

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వరంగల్ డాక్టర్ బి సాంబశివరావు ఆదేశాలతో జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి ఈదురు అనిల్ కుమార్ శుక్రవారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పోర్టు వరంగల్ పరిధిలో విద్యానగర్ మెడికల్ క్యాంపును పర్యవేక్షించినారు. స్థానిక వైద్యాధికారిని డాక్టర్ సుధ ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించి చికిత్సలు అందించడం జరిగినది. అనంతరం డిప్యూటీ మాస్ మీడియా అధికారి అనిల్ కుమార్ ఈదురు విధముగా మాట్లాడినారు వర్షాకాలంలో సాధారణంగా అంటూ వ్యాధులు సంభవిస్తుంటాయి, ఈ అంటూ వ్యాధులు వ్యక్తిగత పరిశుభ్రత లేకపోవడం, పరిసరా పరిశుభ్రత లేకపోవడం, ఈగలు దోమలు వృద్ధి చెంది వాటి ద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, మెదడువాపు మొదలగు వ్యాధులు వ్యాప్తి చెందుతాయి .అలాగే కలుషితమైన ఆహారము నీరు తీసుకోవడం వలన తీవ్రమైన నీళ్ల విరోచనాలు, బంక విరోచనాలు, టైపాడ్ మొదలగు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ప్రజలు దోమలు పుట్టకుండా కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకొని వ్యక్తిగత పరిశుభ్రత పాటించి, కలుషితముగాని ఆహారము నీరును తీసుకొని వ్యాధులకు గురికావద్దని కోరారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది నిరంతరము ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాము, కాబట్టి ప్రజలు వారి సూచనలను పాటించాలని సూచించారు. 11 ఆగస్టు 2025న నిర్వహించబోయే జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంను ప్రతి అంగన్వాడి సెంటర్లో, పాఠశాలలో, కళాశాలలో, ఒక సంవత్సరం నుండి 19 సంవత్సరాల వరకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపినారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది వివిధ శాఖల సమన్వయంతో ఈ జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమమును విజయవంతం చేయడానికి సరియైన ప్రణాళిక తయారు చేసుకోవడం జరిగినది. ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని పిల్లలకు నట్టల నివారణ కొరకు ఈ ఆల్బెండజోన్ మాత్రలను తప్పనిసరిగా వేయించాలని కోరినారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారిని హనుమకొండ సుధా, ఆరోగ్య కార్యకర్తలు శ్రీలత, సంజీవ్ కుమార్, ఆశ కార్యకర్త సృజన, ప్రజలు విద్యార్థులు పాల్గొన్నారు.

## డా. పంజాల శ్రీధర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కారించిన మాదిగ స్టూడెంట్ పెడరేషన్ శుభాకాంక్షలు



**జై భీమ్ న్యూస్ కే.యూ క్యాంపస్**

మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ కె.యూ కమిటీ ఆధ్వర్యంలో ఇటీవలే కాకతీయ యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ నుండి పదోన్నతి లో భాగంగా డిప్యూటీ రిజిస్ట్రార్ గా పదోన్నతి పొందిన డా. పంజాల శ్రీధర్ కి పూలమొక్క బహుకరించి,శాలువాతో సత్కరించి హార్దిక శుభాకాంక్షలు తెలపడం జరిగింది.అదే విధంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధికి, యూనివర్సిటీ లో నెలకొన్నా సమస్యలకు పరిష్కరించడానికి తోడ్పడాలని అందించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎం.ఎస్.ఎఫ్ కె.యూ అధ్యక్షులు కుమ్మరి శ్రీనాథ్ మాదిగ,ఎం.ఎస్.ఎఫ్ సీనియర్ నాయకులు మంద భాస్కర్ మాదిగ,రీసెర్చ్ స్కాలర్ రమేష్ మాదిగ, డా.విష్ణువర్ధన్ మాల మరియు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి తాగుతున్న వ్యక్తుల అరెస్ట్

ఇన్స్పెక్టర్ పి కిషన్

**వరంగల్ జై భీమ్ క్రైమ్ న్యూస్**

మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న వెస్ట్ సిటీ పోచమ్మ గుడి వద్ద ఇద్దరు వ్యక్తులు గంజాయి తాగుతున్నారనే సమాచారం మేరకు మడికొండ ఎస్ఐ రాజ్ కుమార్ అతని సిబ్బంది తో కలిసి దాడి చేయగా అక్కడ ఇద్దరు వ్యక్తులు బాస్కె వంశీ మరియు నల్లాల భాస్కర్ గంజాయి తాగుతూ పట్టుబడగా వారి వద్ద నుండి 50గ్రాముల గంజాయి 2 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించాగా మడికొండ పోలీస్ ఇన్స్పెక్టర్ పి.కిషన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ కిషన్ మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం యువత చెడు దోవ పట్టకుండారాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కలిసి మత్తు పదార్థ రహిత రాష్ట్రంగా చేయడం కోసం అహర్నిశలు కష్టపడుతున్నారు. అందువలన యువత గంజాయి ఇతర దురాలవాట్ల జోలికి పోకుండా ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. ఎవరైనా గంజాయికి సంబందించిన సమాచారం ఉంటే పోలీస్ వారికి తెలపాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గొప్యంగా ఉంచుతామని ఇన్స్పెక్టర్ పి. కిషన్ గారు తెలిపారు.

## ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుక

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

అఖిలభారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి జిల్లా సహాయ కార్యదర్శి బొజ్జ జ్యోతి ఆధ్వర్యంలో వ్యవస్థకు, ప్రజలకు ఎప్పటికప్పుడు భద్రత కల్పిస్తున్నటువంటి పోలీసు అన్నలకు... ఏఐఎస్ఎఫ్ నాయకులకు ముందస్తు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేసి నాయకులతోపాటు సుబేదారి పిఎస్, హనుమకొండ పిఎస్ ఎస్ఐలకి రాఖీ కట్టడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షురాలు బొజ్జా జ్యోతి మాట్లాడుతూ సమ సమాజ స్థాపన కోసం, సమానత్వం కోసం సోదరి, సోదర భావంతో ముందుకు నడవాలని కులమత భేదాలకు అతీతంగా, ప్రాంతాలకు అతీతంగా ప్రతి ఒక్క పౌరుడు, పౌరురాలు సమానత్వం, ఐక్యతతో జీవించడానికి రాఖీ పండుగ దోహదపడుతుందని అన్నారు. సమాజంలో ప్రస్తుతం మహిళలపై, విద్యార్థినిలపై, అనేక రకాల దాడులు జరుగుతున్నాయని వాటినే అరికట్టడంలో ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. రాఖీ పండుగ సందర్భంగా హన్మకొండ జిల్లా ప్రజలకు, విద్యార్థిని, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకురాలు దీప్తి పాల్గొన్నారు.





# సృష్టి ఫెర్టిలిటీ కేసు వ్యవహారం

**ఆరుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు**

**విశాఖపట్నం,ఆగస్టు8(జై భీమ్ న్యూస్ ):**

సృష్టి ఫెర్టిలిటీ- కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. శిశువుల అక్రమ రవాణా, మధ్యవర్తుల హస్తంతో నడిచిన ఈ అమానవీయ ఘటనలో అరెస్టుల పర్వం కొనసాగుతోంది. విశాఖ కేంద్రంగా జరిగిన ఈ స్కాంలో ఇప్పటి వరకూ ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా, హైదరాబాద్ పోలీసులు విచారణలో భాగంగా విశాఖలో ముగ్గురు మధ్యవర్తులు అయిన విజయ్, సరోజ, రత్నాను అరెస్టు చేశారు. ఈ మధ్యవర్తులు శిశువుల కొనుగోలు, అమ్మకాల్లో కీలకంగా వ్యవహరించినట్లు- ఆధారాలు లభించాయని సమాచారం. సృష్టి ఫెర్టిలిటీ- సెంటర్ వ్యవహారంలో నవజాత శిశువులను పేద కుటు-ంబాల నుంచి తీసుకొని దరఖాస్తు చేసుకున్న జంటలకు పెద్ద మొత్తాలకు విక్రయించినట్లు- పోలీసులు గుర్తించారు. ఇది పూర్తిగా వ్యాపార ధోరణితో నడిచిన శిశువుల అక్రమ ముఠాగా భావిస్తున్నారు. ఈ కేసులో మరొక షాకింగ్ విషయమేమిటంటే, డాక్టర్ నమ్రత స్నేహితులు అయిన డాక్టర్ రమ్య, డాక్టర్ రవిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరూ శిశువుల అక్రమ రవాణా వ్యవహారంలో ప్రత్యక్ష, పరోక్షంగా భాగమయ్యారన్న ఆరోపణలపై అరెస్ట్ చేశారు. డాక్టర్ రవి, ప్రస్తుతం కేజీహెచ్ ఆసుపత్రిలో అనస్థీషియా విభాగంలో పని చేస్తున్నారు. ఇటు-వంటి బాధ్యత గల స్థాయిలో ఉన్న వైద్యులు కూడా అక్రమ కార్యకలాపాల్లో నిమగ్నమయ్యారన్న ఆరోపణలు ప్రస్తుతం చర్చనీయాంశ మవుతున్నాయి. ఈ కేసులో ఇంకా పలువురిపై అనుమానాలు ఉన్నాయని, వీరిలో కొంతమంది రాజకీయ, సామాజికంగా బలమైన వారిగా ఉన్నారని పోలీసులు భావిస్తున్నారు. విశాఖలో ఇంకా అరెస్టులు పెరిగే అవకాశం ఉందని పోలీస్ వర్గాలు వెల్లడించాయి.

# ఆవరిస్తున్న క్యుములో నింబస్

**భారీ వర్షాలు పడతాయని హెచ్చరిక**

**హైదరాబాద్,ఆగస్టు8(జై భీమ్ న్యూస్ ):**

రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. అయితే దక్షిణ తెలంగాణకు భారీ వర్ష సూచన ఉన్నట్టు-వాతావరణ శాఖ తెలిపింది. ఉపరితల ఆవర్తనంతో మరో నాలుగు రోజులు వానలు దంచికొట్టనున్నాయని పేర్కొంది. నల్లగొండ, యాదాద్రి, నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లోనే బయటకు రావాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇక క్యుములో నింబస్ మేఘాల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇవాళ సాయంత్రం, రాత్రి సమయాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. శుక్రవారం సాయంత్రం కూడా నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. నిన్నటి అంత వర్షం కురిసే అవకాశం లేదని స్పష్టం చేశారు. మధ్యాహ్నం వరకు ఎలాంటి వర్ష సూచన లేదన్నారు. సాయంత్రం వేళ పలుచోట్ల ఉరుములు, మెరుపులు సంభవించనున్నాయి. మరో ఐదు రోజులపాటు- తెలంగాణలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. 9, 10 తేదీల్లో నల్గొండ, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట్, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. 11, 12వ తేదీల్లో తెలంగాణవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాలు కరిసే అవకాశం ఉందని తెలిపింది. 13వ తేదీన తెలంగాణలోని అన్ని జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

# పిడుగుపాటుకు ఎత్తిపోతల పైపులైన్ దిమ్మెలు నేలమట్టం

**నాగర్‌కర్నూల్,ఆగస్టు8(జై భీమ్ న్యూస్ ):**

కొల్లాపూర్ నియోజకవర్గం, పెంట్లవెల్లి మండల పరిధిలోని మెరుపులు ఉరుములతో కూడిన వర్షానికి పిడుగు పడింది. పిడుగుపాటుకు ఎంగంపల్లి తండా గ్రామ సమీపంలో కృష్ణానది తీరాన నిర్మించిన ఎత్తిపోతల పథకం పైపులైన్ దిమ్మెలు నేలమట్టం అయ్యాయి. ఈ మినీ ఎత్తిపోతల పథకాన్ని 1994లో నిర్మించారు. దీని ద్వారా ఎంగంపల్లి తండా మల్లేశ్వరం మంచాలకట్ట కొన్ని గ్రామాలకు దాదాపుగా 650 ఎకరాలకు సాగునీరు సరఫరా జరిగేది. ఎత్తిపోతల పథకం నిర్మించిన మొదలు కొన్నేళ్లపాటు- ఉపయోగంలో ఉన్నా చాలాకాలం నుంచి మోటార్లు రిపేరు అయ్యాయనే నెపంతో నిరుపయోగంగా మారి శిథిలావ్యవస్థకు చేరింది. దీనిని మరమ్మతులు చేపట్టి, మళ్లీ ఉపయోగంలోకి తీసుకురావాలని రైతులు ఎంతో కాలం నుంచి కోరుతునన్నారు. కృష్ణానది చెంతన ఉన్న సాగుకు నీరు అందక రైతులు మాజీ ఎంఎల్‌లకు, ప్రస్తుత మంత్రి జూపల్లి కృష్ణారావుకి వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోకపోవడంతో ఎత్తిపోతలపై రైతన్నలు ఆశలు వదులుకున్నారు.

# కూనంనేని ఎన్నికపై పిటిషన్ తిరస్కరణ

**న్యూఢిల్లీ,ఆగస్టు8(జై భీమ్ న్యూస్ ):**

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఎన్నికను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. గతంలోనే కూనంనేని ఎన్నికపై దాఖలైన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ జలగం వెంకట్రావు సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు. కాగా.. అడ్మిషన్ స్థాయిలోనే ఈ పిటిషన్‌ను ద్విసభ్య ధర్మాసనం డిస్మిస్ చేసింది.

# మెదక్ ఎంపి రఘునందన్‌కు బెదరింపులు

**సాయంత్రంలోగా చంపేస్తామంటూ ఫోన్ కాల్**

**హైదరాబాద్,ఆగస్టు 8(జై భీమ్ న్యూస్ ):**

బిజెపి మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు మరోసారి దుండగులు ఫోన్ చేసి బెదిరించారు. హైదరాబాద్‌లోనే ఉన్నామని, సాయంత్రంలోగా చంపేస్తామని హెచ్చరించారు. ఆయనకు ఇలా బెదిరింపు ఫోన్ కాల్ రావడం ఆరోసారి. తాజాగా 9404348431 నెంబర్ నుంచి ఫోన్ వచ్చినట్లు- పోలీసులకు ఫిర్యాదు అందింది. రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మొదటిసారి రఘునందన్ రావుకు జూన్ 23న బెదిరింపు కాల్ వచ్చింది. మావోయిస్టుల పేరుతో ఆయన్ను సాయంత్రంలోగా చంపేస్తామంటూ బెదిరించారు. దీంతో ఆయనకు భద్రతను పెంచారు. ఆ తర్వాత పలు మార్లు బెదిరింపు కాల్స్ వచ్చాయి. ప్రతీసారి కూడా ఆయనకు కాల్ చేసి ఇదే విధంగా దుండగులు బెదిరిస్తున్నారు. ముఖ్యంగా ఆపరేషన్ కగార్ ఆపాలని లేకుండా చంపేస్తామని.. దమ్ముంటే కాపాడు కోవాలని దుండగులు హెచ్చరిస్తున్నారు. దీంతో పోలీసులు ఆయనకు కట్టుదిట్టమైన భద్రతను కల్పించారు.

# నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

**పాడేరులో పెద్ద ఎత్తున గిరిజన సంక్షేమ కార్యక్రమాలు**
**హాజరువుతున్న సిఎం చంద్రబాబు నాయుడు**
**గిరిజనుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం**
**రూ.7557 కోట్లు షెడ్యూల్డ్ -ట్రైబ్ కాంపోనెంట్ కింద ఖర్చు**

**అమరావతి,ఆగస్టు 8(జై భీమ్ న్యూస్ ):**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే గిరిజన ప్రాంతాల్లో నూతన అధ్యాయం ఆరంభమైంది. ఏజెన్సీ జిల్లాల్లోని ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిత్యం కృషి చేస్తోంది. గతంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాలను మైదాన ప్రాంతాలతో సమానంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా ఆగస్టు 9వ తేదీన ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాడేరులో జరుగనున్న కార్యక్రమానికి హాజరు కానున్నారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ- కృత్రిమ మేధస్సు, ఆదివాసీల భవిష్యత్తు అనే థీమ్ తో ఈ ఏడాది ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ గిరిజన దినోత్సవ నిర్వహణకు పిలుపునిచ్చింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం అల్లూరి జిల్లా పాడేరులో అంతర్జాతీయ గిరిజన దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. పాడేరు మండలం వంజంగి గ్రామంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరు కానున్నారు. తొలుత మోదకొండమ్మ ఆలయాన్ని దర్శించుకున్న అనంతరం స్థానిక గిరిజన సంప్రదాయ వేడుకలకు హాజరు అవుతారు. ఆదివాసీల ఇళ్లకు వెళ్లి వారి కష్టసుఖాలను ముఖ్యమంత్రి స్వయంగా తెలుసుకోనున్నారు. అనంతరం కాఫీ ప్లాంటేషన్ పెంపకందారులతో సీఎం మాట్లాడనున్నారు. ఆ తర్వాత లగిసపల్లె వద్ద ఏర్పాటు- చేసిన ప్రజా వేదిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం అక్కడి నుంచే శంకుస్థాపన చేయనున్నారు. అలాగే గిరిజన ప్రాంతాల్లో ప్రాజెక్టులకు సంబంధించిన అంశంపై సీఎం సమక్షంలో ఎంఓయూలను కుదుర్చుకోనున్నారు. అనంతరం కొద్దిసేపు పార్టీ శ్రేణులతోనూ ముఖ్యమంత్రి మాట్లాడనున్నారు. మారుమూల గిరిజన ప్రాంతాలు, ఆవాసాలను ఏజెన్సీలోని ప్రధాన కేంద్రాలు, ఇతర మైదాన ప్రాంతాలతో అనుసంధానించేలా ప్రభుత్వం రహదారుల నిర్మాణ ప్రాజెక్టుల్లో వేగం పెంచింది. గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, వంతెనలు నిర్మాణంతో పాటు- ఆదివాసీల ప్రాంతాలు, నివాసాలకు కనెక్టివిటీ- కోసం రూ. 2404 కోట్లు- ఖర్చు చేయనుంది. వచ్చే ఐదేళ్లలో 2075కు పైగా గిరిజన గ్రామాలకు, నివాసాలను రోడ్లు, వంతెనలతో అనుసంధానించాలని నిర్ణయించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రోడ్ల కారిడార్లను రూ.41 కోట్లతో చేపట్టనుంది. ఐటీ-డీఏ చింతూరులో కమ్యూనిటీ- హెల్త్ సెంటర్ ను 50 నుంచి 100 పడకల ఆస్పత్రికిగా మార్చడంతో పాటు- సీతంపేట, పార్వతీపురం, రంపచోడవరం, కేఆర్ పురం, శ్రీశైలం ఐటీ-డీఏ ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ- ఆస్పత్రుల నిర్మాణాల కోసం రూ.50 కోట్ల చొప్పున ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. త్వరలోనే నిర్మాణాలు పూర్తై ఆస్పత్రులు అందుబాటు-లోకి రానున్నాయి. పాడేరులో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. అలాగే జల్ జీవన్ మిషన్ కింద గిరిజన ప్రాంతాల్లోని 13,816 ఆవాసాలకు మంచినీటి సరఫరా కోసం రూ. 2,373 కోట్లతో ప్రభుత్వం పనులు చేపట్టింది. 2026 నాటికి ఈ పనులు పూర్తి చేసి ఆదివాసీలు అందరికీ తాగునీరు అందుబాటు-లోకి తెచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. డీఎస్సీ సహా వివిధ పోటీ- పరీక్షలకు గిరిజన యువతీ యువకులు సన్నద్ధం చేసేందుకు విశాఖ, విజయవాడ, తిరుపతి తదితర ప్రాంతాల్లో స్టడీ సర్కిళ్లను ప్రభుత్వం ఏర్పాటు- చేసింది. అలాగే గిరిజన ప్రాంతాల్లో రెసిడెన్షియల్ పాఠశాల భవనాలను వసతి గృహాలుగా మార్చేందుకు రూ.150 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. 520కి పైగా రెసిడెన్షియల్ పాఠశాల భవనాలను వసతి గృహాలుగా మార్చటం కోసం రూ.150 కోట్లను కూడా ప్రభుత్వం మంజూరు చేసింది. 520కి పైగా పాఠశాల భవనాల నిర్మాణం కోసం రూ.64 కోట్లను కూడా ప్రభుత్వం వ్యయం చేస్తోంది. పార్వతీపురం మన్యంలో పూర్ణపాడు-కొమరాడ మధ్య నాగావళి నదిపై రూ.10 కోట్లతో హై లెవల్ వంతెనను కూడా చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మరోవైపు ప్రపంచ బ్రాండ్ గా మారిన అరకు కాఫీని మరింత విస్తరించేందుకు వీలుగా మన్యంలో ఎ÷-లాంటేషన్ను పెంచేందుకు కూడా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. కాఫీ పల్పింగ్, ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు- చేయటంతో పాటు- ప్లాంటేషన్ విస్తరణ కోసం రూ.202 కోట్లను ప్రభుత్వం వ్యయం చేయనుంది. ఏజెన్సీ ప్రాంతాల్లోని యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా పర్యాటక ప్రాజెక్టులను చేపట్టనున్నారు. గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. అధికారంలోకి వచ్చిన అనంతరం 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.7557 కోట్ల రూపాయల్ని షెడ్యూల్డ్ -ట్రైబ్ కాంపోనెంట్ కింద కూటమి ప్రభుత్వం వ్యయం చేసింది. అధికారంలోకి వస్తూనే రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న 4.82 లక్షల మంది గిరిజన కుటు-ంబాలకు నెలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ ను ప్రభుత్వం అందిస్తోంది. అలాగే త్వరలోనే సోలార్ రూఫ్ టాప్ ద్వారా ఇంటిపై సౌరఫలకాలను ఏర్పాటు- చేసేందుకు కూడా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 3,77,051 మంది గిరిజనులకు ప్రతి నెలా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా ప్రభుత్వం రూ.1,595 కోట్లు- ఖర్చు చేస్తోంది. అలాగే తల్లికి వందనం పథకం ద్వారా 4,86,803 మంది గిరిజన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.642 కోట్లను ప్రభుత్వం జమ చేసింది.

# బిజెపితో బిఆర్ఎస్ పొత్తు సాధ్యమేనా?

**బిసి బిల్లుపై ఇరుపార్టీలకు కాంగ్రెస్ సవాల్**
**తాజా రాజకీయాలపై సర్వత్రా ఆసక్తి**

**హైదరాబాద్,ఆగస్టు8(జై భీమ్ న్యూస్ ):**

పదేళ్లపాటు అధికారం అనుభవించి, ఆర్థికంగా బలపడి, ఇష్టారాజ్యంగా పాలన చేసిన బిఆర్ఎస్‌కు ప్రస్తుత పరిస్థితులు మింగుడు పడడం లేదు. వరుసగా మూడోసారి అధికారం తమదే అనుకున్న తరుణంలో పరిస్థితులు తలకిందులు అయ్యాయి. ఈ ఉక్కపోతను కెసిఆర్ కుటంబం భరించకోలేక పోతున్నది. అందుకే తరవాత తమదే అధికారం అని మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. రేవంత్ సర్కార్‌ను విధానాల పరంగా కాకుండా వ్యక్తిగతంగా విమరశలకు దిగుతున్నారు. ఓ వైపు విచారణ, మరోవైపు విమర్శలు, ఇంకోవైపు కూతురు కవిత సొంత రాజకీయాలు వంటి విషయాలు కెసిఆర్‌ను ఆందోళనకు గురి చేస్తున్నాయి. అందుకే దీనిని నుంచి బయటపడే మార్గాల గురించి ఆలోచన చేస్తున్నట్లు చర్చ సాగుతోంది. కాంగ్రెస్ ప్రధానంగా ఈ రెండు పార్టీల మధ్య అవగాహన ఉందన్న ప్రచారం జోరు పెంచింది. ప్రధానంగా రేవంత్ సిఎం కావడాన్ని బిఆర్ఎస్ తట్టుకోలేక పోతోంది. ఈ క్రమంలో దీనికి చెక్ పెట్టాలన్న ఆలోచన నుంచే బిజెపికి చేరువ కావాలన్న సూత్రం పుట్టిందన్న ప్రచారం సాగుతోంది. బిసి రిజర్వేషన్ల విషయంలో బిఆర్ఎస్, బిజెపి రెండూ ఒక్కటేనని కాంగ్రెస్ విమర్శిస్తోంది. బిజెపికి దగ్గర కావడానికి బిఆర్ఎస్ యత్నించిందని కవిత కూడా సంచలన ఆరోపణలు చేసింది. ప్రధానంగా రెండు విషయాలపై బిఆర్ఎస్‌లో అంతర్గతంగా చర్చ సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ బిఆర్ఎస్ అంటే కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావు లాంటి వారి మధ్యనే అని గుర్తించాలి. ఇకపోతే ఎమ్మెల్యేల అనర్హతపై బిఆర్ఎస్ పట్టుబడుతోంది. మూడునెలల సమయం ఇవ్వడంతో దీనిని గట్టిగా ప్రచారం చేస్తోంది. ప్రస్తుత రాజకీయాలను మలుపు తిప్పాలన్నదే వారి ఎత్తుగడగా ఉంది. బిఆర్ఎస్‌కు రాజ్యసభలో నలుగురు సభ్యులు ఉన్నారు. ఐదుగురిలో కేశవరావు జారుకుని రాజీనామా చేశారు. బిజెపికి కూడా రాజ్యసభలో బలం అవసరం. నలుగురు రావడం అంటే తక్కువేమీ కాదు. అందుకే బిఆర్ఎస్, బిజెపిల విలీనపై ఈ మధ్య పుంఖానుపుంఖాలుగా వార్తలు వస్తున్నాయి. ఇందులో ప్రధానంగా బిఆర్ఎస్ విలీనం అయితే కెసిఆర్ కేంద్రమంత్రిగా ఢిల్లీకి వెళ్లడం.. ఒప్పందంగా ఉండొచ్చు. తదుపరి కాలంలో తెలంగాణలోనూ షిండేలను సృష్టించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అన్నది కావచ్చు. ఇవన్నీ కూడా ఊహాజనితమే అయినా ..వీటిచుట్టే ప్రచారం సాగుతోంది. బిఆర్ఎస్, బిజెపి ఎమ్మెల్యేలు కలిశాక వారి బలం ఇప్పుడున్న పరిస్థితుల్లో 36కు చేరుకుంటుంది. ఓ పదిమంది కాంగ్రెస్‌లో చేరారు. వారిని కూడా వెనక్కి రప్పించడం జరగవచ్చు. లేదా కోర్టు ద్వారా ఒకరిద్దరి పై వేటు వేయించి దారికి తెచ్చుకునే ప్రయత్నాలు కూడా సాగుతున్నాయి. అందుకే తెలంగాణ రాజకీయాలు ఊహించని మలుపులు తిరుగుతున్నాయనే భ్రమను కలిపిస్తున్నాయి. భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీల మధ్య విలీన చర్చలు జరుగుతున్నాయని విస్తృత ప్రచారం ప్రారంభమయింది. గత నాలుగైదు నెలలుగా ఈ తరహా ప్రచారం అంతర్గతంగా సాగుతోంది. కానీ ఎవరూ స్పందించలేదు. ఇప్పుడు ప్రచారం మరింత ఊపందుకుంది. అయితే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాత్రం ఖండించారు. ఓ ట్వీట్ ద్వారా వీలైనంత బలంగా విలీనం ప్రచారం కుట్ర పూరిత ప్రచారం అన్నారు కానీ.. ఆ వాదనలో బలం ఉందని రాజకీయవర్గాలు భావించడం లేదు. బీఆర్ఎస్ పార్టీ విలీనంపై జరుగుతున్న ప్రచారాన్ని తిప్పి కొట్టడానికి బీఆర్ఎస్ వ్యూహాత్మక నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. అందుకే ఎక్కువ మంది విలీన చర్చలు నిజమేనని అనుకుంటున్నారు. గతంలో కెటిఆర్, హరీష్ రావుల ఢిల్లీ టూర్‌పై కాంగ్రెస్ పార్టీ సెటైర్లు వేసింది. రేవంత్ రెడ్డి అయితే పార్టీని తాకట్టు పెట్టడానికి వెళ్లారని విమర్శించారు. బీజేపీ నేతల కోసం పడిగాపులు పడుతున్నారని మండిపడ్డారు. బీజేపీతో కలిసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శలు గుప్పించారు. అయితే ఈ విషయంలో బీఆర్ఎస్ వైపు నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఇదే క్రమంలో సుప్రీం తీర్పుకు అనుగుణంగా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హతా వేటు వేయించేందుకు న్యాయనిపుణులతో చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. నిజానికి నిప్పులేనిదే పొగరాదు. ఎక్కడో ఒకచోట ఏదో ఒక సందర్భం లేకుండా ఇలాంటి వార్తలు రావు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఎలాంటి పొత్తు చర్చలు జరగకపోతే.. ఈ విషయాన్ని ఖండించడానికి రెండు పార్టీలు ఎందుకు తటపటాయిస్తున్నాయన్నది రాజకీయవర్గాల నుంచి వస్తున్న మొదటి ప్రశ్న. నిర్మోహమాటంగా ఖండించడానికి బీఆర్ఎస్ ముఖ్య నేతలు సిద్దంగా లేరు. బీజేపీతో పొత్తు లేదా విలీనం అంటూ జరుగుతున్న ప్రచారంపై స్పందించడానికి నిరాకరిస్తున్నారు. తెలంగాణ కోసం రాజీలేని పోరాటం చేస్తామని కెటిఆర్ చెబుతున్నారు. తెలంగాణ ఉన్నంతవరకు గులాబీ జెండా ఎగురుతుందన్నారు. కాంగ్రెస్‌కు బిజెపి సహకరిస్తోందని కూడా ఎదురుదాడి చేస్తున్నారు. విలీనం లేదా పొత్తు కుదిరితే బీఆర్ఎస్ పార్టీకి ఉన్న క్యాడర్ బలం..బీజేపీకి కలసి వస్తుందని.. కింది స్థాయి వరకూ పార్టీ నిర్మాణం ఏర్పడుతుందని ..ఇతర సీనియర్ నేతలు పాజిటివ్‌గా స్పందిస్తున్నారని అంటున్నారు. అయితే బీఆర్ఎస్ క్యాడర్ మాత్రం.. అలాంటి పరిస్థితి రాదని.. కేసీఆర్ తన పార్టీని ఇతర పార్టీల్లో కలిపేంత నిర్ణయం తీసుకోరని, పొత్తులకు కూడా దూమని అంటున్నారు. రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే.

# ఫసల్‌బీమా యోజనతో రైతులకు అండ

**హైదరాబాద్,ఆగస్టు8(జై భీమ్ న్యూస్ ):**

కేంద్రం తీసుకుని వచ్చిన ఫసల్ బీమాలో చేరాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రైతులకు మేలు జరుతుందని కూడా తెలిపింది. రైతులను ఆదుకునే క్రమంలో పసల్ బీమా యోజనలో చేరడం, రైతల కిస్తీకూడా ప్రభుత్వమే భరిస్తుందిన సిఎం, డిప్యూటి సిఎంలు కూడా వెల్లడించారు. రైతులకు కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం రైతాంగానికి వెన్నుదన్నుగా నిలుస్తుంది..ప్రకృతి కరుణించక అనుకోని వైపరీత్యాలతో పంట నష్టపోతూ... ఇక వ్యవసాయం వద్దు అనుకునే రైతన్నకు ప్రధానమంత్రి ఫసల్ భీమ యోజన అండగా నిలుస్తోంది. దేశానికి వెన్నుముక రైతు , రైతు పంటలు పండిస్తేనే ప్రజలకు ఐదు వేళు ళ నోట్లోకి వేలుతాయి. అలాంటి రైతు తాము పండించిన పంటకు అకాల వర్షాలతోనో అనుకోని వైపరీత్యాలతో పంట నష్టపోతే అ రైతు పరిస్తితి ఏంటి అనుకునే తరుణంలో ఫసల్ బీమాయోజన వారికి ఆసరాగా నిలిచింది. పంట నష్టపోయిన రైతన్నను అమ్మలా అదుకుంటూతుంది. వ్యవసాయం దండుగ అని గతంలో అన్న రైతుకు వ్యవసాయం పండుగా అనేలా ప్రతి రైతు ప్రకృతి వైపరీత్యాలకు బెదరకుండా తమ భూమిని సాగు చేసి వ్యవసాయాన్ని చేసే దైర్యాన్ని ఇస్తుంది.. ఫసల్ బీమా యోజన పథకం. రైతు తాము పండించే పంట పెట్టుబడి ఎకరాకు అందులో రెండు శాతం ఫసల్ బీమా పథకం ప్రీమియం కడితే చాలు వరిపంటకు ఎకరాకు 34 వేల బీమా ఉండగా అందులో రెండు శాతం అంటే 680 రూపాయలు ప్రీమియం కడితే చాలు అలగే మొక్క జొన్న ... వేరుశనిగే పంటలకు రెండు శాతం ఉండగా పసుపు పంటకు మాత్రం 3.5 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉంది.. దీంతో రైతుకు ఎదురయ్యే ఇబ్బందులు తెగుళ్ళు .. వడగళ్ళు.. పిడుగులు.. అకాల వర్షాలతో పంట నష్టపోతే ఆ రైతుకు ఫసల్ బీమా రక్షణగా నిలుస్తుంది.. వీటితో పాటు ఇందులోనే వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం ద్వారా పత్తి పంటతో పాటు మిర్చిపంటకు కూడా రైతు 5 శాతం ప్రీమియం చెల్లిస్తే వాతావరణం అనుకులించ కున్న వేసిన విత్తనం మొలకేత్తకపోయిన రైతుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పంట పెట్టుబడి నష్ట పోకుండా ఫసల్ బీమా పథకం అండగా నిలుస్తుంది. పంటకోత తర్వాత జరిగే నష్టాలకూ బీమా వర్తిస్తుంది. పంటనష్టం జరిగిందని తెలియగానే బీమా మొత్తంలో 25 శాతం మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారు. అంతేకాదు క్లెయిమ్ సెటిల్ కోసం పంట నష్టాన్ని అంచనా వేయటానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడతారు. స్మార్ట్ ఫోన్ల ద్వారా పంట కోత సమాచారాన్ని ఫొటోలు తీసి, అప్‌లోడ్ చేస్తారు. గతంలో ఎన్నో పంట బీమా పథకాలు ఉన్న కూడా తాము అకాల వర్షాలతో నష్టపోయే వాళ్ళమని... ఇప్పుడు ఫసల్ బీమాపై వ్యవసాయ అధికారులతో పాటు బ్యాంకు అధికారులు అవగాహన కల్పించడంతో తాము వ్యవసాయం అంటే కష్టం కాదని వ్యవసాయాన్ని ఇష్టంతో చేసుతున్నామని రైతులు తెలుపుతున్నారు.




# వార్-2..కూలీపై సర్వత్రా ఆసక్తి

## హీరోల ఎంట్రీపై ఉత్కంఠ కలిగించేలా మేకింగ్

ఎన్టీఆర్ వార్-2. రజనీకాంత్ కూలీ చిత్రాలపై ఇప్పుడు సర్వత్రా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ రెండూపోటీగా విడుదలవుతున్నాయి. సినిమా స్టార్ కాగానే హీరో కనిపించే విధానానికి చెక్ పెట్టేస్తున్నారు మేకర్స్. గతంలో ఓ స్పెషల్ సాంగ్ లేదా ఓ చిన్న ఎలివేషన్లతో హీరో ఎంట్రీ ఉండేది. కానీ ఇప్పుడు మాత్రం మినిమం అరగంట గ్యాప్ ఉండాల్సిందే. ఈ మధ్య సలార్, కల్కిలో అరగంట తర్వాతే యంగ్ రెబల్ స్టార్ దర్శన భాగ్యం లభించింది.. జస్ట్ కటౌట్ కనిపిస్తే చాలు అనుకుంటు-న్న ఫ్యాన్స్. ఈ గ్యాప్ పెద్దగా లెక్క చేయడం లేదు. ఇప్పుడు కూలీ, వార్ 2లో రజనీకాంత్, జూనియర్ ఎంట్రీ- కూడా ఇలాగే ఎ÷-లాన్ చేసినట్లు- టాక్ నడుస్తోంది. కూలీలో రజనీకాంత్ స్క్రీన్ పై కనిపించేంది మూవీ స్టార్ట్ అయిన గంట తర్వాత అన్నది బజ్ నడుస్తోంది. ఈ గంటలోనే మిగిలిన క్యారెక్టర్లన్నింటినీ చూపించబోతున్నాడట లోకేశ్ కనగరాజ్. అటు- బాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమౌతున్న తారక్ కూడా -టైటిల్ కార్డ్స్ పడిన అరగంట తర్వాతే కనిపించబోతున్నాడట. వార్ 2లో హృతిక్- తారక్ ఫేస్ ఆఫ్ అండ్ సాంగ్ స్క్రీన్ తగలబడి పోతాయంటున్నారు బాలీవుడ్ క్రిటిక్స్. ఇలా హీరోలను సినిమా స్టార్టయిన అరగంటకు, గంటకు చూపించి ప్రేక్షకుడికి అ-టె-న్షన్ క్రియేట్ చేస్తున్నారు మేకర్స్. ఏదేమైనా తమ ఫేవరేట్ హీరోల కోసం ఎంత సేపేనా వెయిట్ చేసేందుకు రెడీగానే ఉన్నారు డై హార్ట్ ఫ్యాన్స్. రెండు హై ఆక్టేన్ మూవీస్ కూలీ, వార్ 2 బాక్సాఫీస్ దగ్గర బిగ్గెస్ట్ వార్‌కు రెడీ అవుతున్నాయి. రెండూ తెలుగు సినిమాలు కాదు కానీ అలా అని పొరుగు సినిమాలనీ తీసేయలేం. ఎందుకంటే ఇద్దరు టాలీవుడ్ బిగ్గెస్ట్ స్టార్ హీరోలు నాగార్జున, జూనియర్ ఎన్టీఆర్ ఈ చిత్రాల్లో భాగం కాబోతున్నారు. సో మన సినిమాలుగా రిసీవ్ చేసుకుంటున్నారు టాలీవుడ్ ఆడియన్స్. మరి ఆగస్టు 14న ఏ సినిమా హిట్ టాక్ తెచుకుంటుందో బాక్సాఫీస్ దగ్గర బ్లాక్ బస్టర్ సౌండ్ చేస్తుందో లెట్స్ వెయిట్.



# మళ్లీ లైన్‌లోకి వచ్చిన అనుపమ పరమేశ్వరన్

టిల్లు స్క్వేర్‌తో హోమ్లీ లుక్కు నుండి మేకోవర్ అయిన అనుపమ పరమేశ్వరన్ ఈ ఏడాది డ్రాగన్‌తో ఓ మంచి శు భారంభాన్ని ఇచ్చింది. అయితే ఇటీవల వచ్చిన జానకి వి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ చెరిపేసింది. -టైటిల్ వివాదం వల్ల సరైన ప్రమోషన్లు చేయక ఏదో రిలీజ్ చేశామంటే చేశాం అని తూతూ మంత్రంగా, వ్యవహారం సాగింది. దీని వల్ల కేరళలో చాలా గ్యాప్ తర్వాత వచ్చిన ఫిల్మ్ తన కెరీర్‌కు యూజ్ కాకుండా పోయింది. ఈ రిజల్ట్ ముందే ఊహించారేమో తెలుగులో కూడా రిలీజ్ చేయాలనుకుని చివరి నిమిషంలో వెనక్కు తగ్గారు మేకర్స్. అనుపమ పరమేశ్వర్ కు ఆఫర్ల కొదవ లేదు కానీ చేసిన సినిమాలన్నీ వాయిదాల బాట పడుతున్నాయి. ఇప్పటికే తమిళ్, మలయాళంలో కంప్లీటైన లాక్ డౌన్ లాస్ట్ ఇయర్, పెట్ డి-టె-క్టివ్ ఈ ఏడాది ఫస్ట్ ఆఫ్‌లో థియేటర్లలో హాయ్ చెప్పాల్సి ఉండగా రిలీజ్ డిలే అవుతున్నాయి. టాలీవుడ ఫిల్మ్ పరదా కూడా ప్రవీణ్ కంద్రేగుల శుభం ప్రాజెక్టుపై ఫోకస్ చేయడంతో పోస్ట్ పోన్ అవుతూ ఎట్టకేలకు ఆగస్టు 22న డేట్ లాక్ చేసుకుంది. పరదా బైలింగ్వల్ మూవీగా రాబోతుంది. ఇటు- తెలుగు, అటు- మలయాళంలో రిలీజ్ చేయనున్నారు మేకర్స్. నెక్ట్స్ త్రీ మంత్స్‌లో త్రీ ఇండస్ట్రీల్లో అనుపమ సందడి చేయనుంది. పరదాతో పాటు- తమిళ పడమ్ బైసన్ రాబోతుంది. మారి సెల్వరాజ్ స్పోర్ట్ డ్రామాలో విక్రమ్ సన్ ధ్రువ్ విక్రమ్ హీరో. అక్టోబర్ 17పై ఇప్పటికే కర్చీఫ్ వేసుకుంది ఈ సినిమా. ఇదే కాకుండా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తో చేస్తున్న కిష్కిందపురి కూడా అదే నెలలో తీసుకు రానున్నారని టాక్. అనేక వాయిదాల అనంతరం బ్యాక్ టు-బ్యాక్ సినిమాలతో వస్తోంది అనుపమ.

# కాంతారా నుంచి కనకవతి పరిచయం

కన్నడ నటుడు రిషభ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కాంతార చాప్టర్ -1. 2022లో రిలీజై బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచిన 'కాంతార' సినిమాకు ప్రీక్వెల్ గా ఈ సినిమా వస్తుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ప్రమోషన్స్ షురూ చేశారు మేకర్స్. ఇందులో భాగంగా ఈ సినిమాలో నటిస్తున్న కథానాయక రుక్మిణి వసంత్‌ని పరిచయం చేశారు మేకర్స్. రుక్మిణి వసంత్ ఇందులో కనకవతిగా కనిపించబోతున్నట్లు- ప్రకటించారు. ంబాలే ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కిరంగదూర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా.. అజ్నీశ్ లోకనాథ్ సంగీతం అందిస్తున్నారు. ఇక ఈ చిత్రాన్ని కన్నడతో పాటు- తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, బెంగాలీ, ఇంగ్లిష్ భాషల్లో విడుదల చేయనున్నారు.




# విడుదలకు సిద్ధమవుతున్న అఖండ-2

నందమూరి నటసింహం బాలకృష్ణ- మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'అఖండ 2' పై ప్రేక్షకుల్లో విపరీతమైన ఆసక్తి నెలకొంది. సింహా, లెజెండ్, అఖండ వంటి ఘన విజయాల తర్వాత ఈ జోడీ మరోసారి స్క్రీన్ మీద అదరగొట్టేందుకు సిద్ధమవుతోంది. అఖండ 2 చిత్రం 2021లో వచ్చిన బ్లాక్ బస్టర్ 'అఖండ' కు సీక్వెల్ కావడం విశేషం. ఆ చిత్రంలో బాలయ్య పోషించిన ఆఘోర పాత్ర, బోయపాటి మాస్ మేకింగ్, తమన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రేక్షకులని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇప్పుడు ఆ ఫార్ములాను మరింత పవర్‌ఫుల్‌గా స్క్రీన్ మీదకి తీసుకురావాలని బోయపాటి తెగ కష్టపడుతున్నారు. ఈ భారీ పాన్ ఇండియా మూవీలో ప్రగ్యా జైశ్వాల్, సంజయ్ దత్, ఆది పినిశెట్టి, సంయుక్త మీనన్, జగపతిబాబు, హర్షాలీ మల్హోత్రా వంటి తారాగణం కనిపించనున్నారు.

